Truth of News
PRGI Reg No: APTEL/26/A4781
# సూర్య వాస్తవం
http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్




IRS PUBLICATIONS
irspublications12@gmail.com

అన్నమయ్య జిల్లా | సంపుటి: 02 | సంచిక : 04 | మంగళవారం 11 ఆగస్టు 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

# అమిత్ షా పార్లమెంట్‌కు రావాలి

- విద్యార్థులపై ఢిల్లీ పోలీసుల క్రూరమైన దాడికి సమాధానం చెప్పాలి
- ప్రతిపక్షాల ఆందోళన... పోటీగా అధికార ఎన్డీఏ నిరసన
- లోక్‌సభలో రెండు బిల్లులు, రాజ్యసభలో ఒక బిల్లు ఆమోదం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం : పార్లమెంట్ వర్షాకాల సమావేశాల చివరి దశలో అధికార, ప్రతిపక్షాల మధ్య ప్రతిష్ఠంభన కొనసాగుతోంది. ఢిల్లీలో విద్యార్థులు, యువకులపై ఢిల్లీ పోలీసులు, కేంద్ర బలగాల క్రూరమైన దాడి, అయోధ్య రామమందిర విరాళాల అపహరణకు నిరసనగా ప్రతిపక్ష ఎంపీలు ఆందోళన చేపట్టారు. అయితే దానికి పోటీగా అధికార ఎన్డీఏ ఎంపీలు జార్ఖండ్‌లో ఉద్యోగార్థులపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా నిరసన తెలిపారు. మంగళవారం పార్లమెంట్ మకర ద్వారం వద్ద ప్రతిపక్ష ఎంపీలు నిరసనలు చేపట్టారు. ఢిల్లీలో విద్యార్థుల నిరసనలపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా సభకు వచ్చి సమాధానం చెప్పాలంటూ నినాదాలతో హోరెత్తించారు. అయితే దీనికి పోటీగా ఎన్డీఏ ఎంపీలు ప్లకార్డులు పట్టుకుని ఆందోళన చేపట్టారు. దీంతో పార్లమెంట్ మకర ద్వారం వద్ద ఎన్డీఏ, ప్రతిపక్ష ఎంపీలు పోటాపోటీగా నినాదాలు చేశారు. జార్ఖండ్‌లో విద్యార్థుల నిరసనలపై చర్చ నుంచి కాంగ్రెస్ నాయకుడు




రాహుల్ గాంధీ పారిపోతున్నారని ఎన్డీయే ఎంపీలు ఆరోపించారు. ఢిల్లీలో జులై 20న జరిగిన నిరసనలపై కేంద్ర హోం మంత్రి అమిత్ షా జవాబుదారీతనం వహించాలని ప్రతిపక్ష ఎంపీలు డిమాండ్ చేశారు.

పార్లమెంట్ ఉభయ సభలకు గైర్హాజరైన ప్రధాని మోడీ, హోంమంత్రి అమిత్ షా... ఎన్డీఏ ఎంపీల మంగళవారం నాటి సాధారణ సమావేశానికి (మంగళ్ మిలన్) హాజరయ్యారు. జార్ఖండ్‌లో ప్రశ్నపత్రాల లీకేజీకి, దానిపై పోలీసుల చర్యకు వ్యతిరేకంగా జరుగుతున్న నిరసనను ప్రతిపక్షం నుంచి తమనుతాము రక్షించుకోవడానికి ఒక ఆయుధంగా ఉపయోగించుకోవాలని సమావేశం నిర్ణయించింది. దీని తరువాత, ఎన్డీఏ ఎంపీలు ప్లకార్డులు, - మిగతా 2లో..



ఆగస్టు 15ను పండుగలా

## జరుపుకుందాం

- 'హర్ ఘర్ తిరంగా'లో పాల్గొనాలని మోదీ పిలుపు
- ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకం ఎగరేయాలని సూచన
- స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించాలని విజ్ఞప్తి
- 'వికసిత్ భారత్' నిర్మాణానికి ప్రతిజ్ఞ చేయాలని పిలుపు
- ఈ ఏడాది 'వందేమాతరం'కు ప్రత్యేక ప్రాధాన్యం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం : స్వాతంత్య్ర దినోత్సవం సందర్భంగా 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమంలో ప్రజలు చురుగ్గా పాల్గొనాలని ప్రధాని నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఆగస్టు 15న ప్రతి ఇంటా త్రివర్ణ పతాకాన్ని ఎగురవేసి స్వాతంత్య్ర సమరయోధులకు నివాళులర్పించాలని కోరారు. 'హర్ ఘర్ తిరంగా.. ఘర్ ఘర్ తిరంగా.. హర్ మన్ తిరంగా' - మిగతా 2లో..



వందేమాతరం బిల్లుకు

## రాష్ట్రపతి ఆమోదం..

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం : వందేమాతరం బిల్లుకు రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ఆమోదం తెలిపారు. దాంతో బిల్లు చట్టంగా మారనుంది. ఈ చట్టం ప్రకారం జాతీయ చిహ్నాలను అవమానించడం నేరం. మూడేళ్ల వరకు జైలు శిక్ష పడుతుంది. జాతీయ గేయాన్ని పాడకుండా అడ్డుకున్నా, అవమానించినా నేరంగా పరిగణిస్తారు.




## కేరళం బిల్లుకు ఆమోదం

న్యూఢిల్లీ - సూర్య వాస్తవం : కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లుకు లోక్‌సభ మంగళవారం ఆమోదం తెలిపింది. విపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి - మిగతా 2లో..

# సామాన్యుడిపై ధరల భారం వద్దు..

- ఎల్ నినోను అధిగమించి 15శాతం వృద్ధి సాధించాలి: సీఎం చంద్రబాబు
- ఏపీ ఆర్థిక వృద్ధిపై సీఎం సమీక్ష
- 2025-26 రెండో త్రైమాసికంలో 10.7శాతం వృద్ధిరేటు నమోదు
- ఎల్ నినో ప్రభావం, ధరల పెరుగుదలపై సీఎం ఆందోళన
- 15 శాతం వృద్ధిరేటు సాధించాలని అధికారులకు కొత్త లక్ష్యం
- సామాన్యుడిపై ధరల భారం పడకుండా కమిటీ ఏర్పాటుకు సూచన



అమరావతి - సూర్య వాస్తవం : ఆంధ్రప్రదేశ్ ఆర్థిక వ్యవస్థ బలంగా పుంజుకుంటూ సానుకూల వృద్ధిరేటుతో దూసుకెళ్తోంది. గడిచిన రెండేళ్లుగా జాతీయ సగటును మించి ప్రగతి సాధిస్తున్న ఏపీ, 2025-26 ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికంలో 10.7 శాతం వృద్ధిరేటును నమోదు చేసింది. అయితే, ఈ సానుకూల వాతావరణం లోనూ ఎల్ నినో రూపంలో పొంచివున్న ముప్పును ముందుగానే పసిగట్టిన ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, దానిని అధిగమించి రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు పథంలో నడిపించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు. మంగళవారం తన క్యాంపు కార్యాలయంలో ప్రణాళికా విభాగం అధికారులు సమర్పించిన జూలై నెల ఆర్థిక నివేదికపై ఆయన సమీక్ష నిర్వహించారు.

### అన్ని రంగాల్లోనూ అద్భుత ప్రగతి

ప్రణాళికా విభాగం నివేదిక ప్రకారం, రాష్ట్ర స్థూల ఉత్పత్తి (జీఎస్‌డీపీ) వృద్ధి రేటు 2023-24లో 6.5 శాతం ఉండగా, 2025-26 నాటికి 9.9 శాతానికి పెరిగింది. ముఖ్యంగా వ్యవసాయం, - మిగతా 2లో..

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

- వీలైనంత త్వరగా టెండర్ ప్రక్రియ ప్రారంభించాలి
- మెట్రో రద్దీకి అనుగుణంగా కొత్త కోచ్ లు కొనుగోలు చేయాలి
- అధికారులకు సీఎం రేవంత్ రెడ్డి ఆదేశం



హైదరాబాద్ - సూర్య వాస్తవం : హైదరాబాద్ మెట్రోరైలు రెండో దశలో భాగంగా పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులను ఆదేశించారు. హైదరాబాద్ మెట్రో రైల్ లిమిటెడ్ (హెచ్ఎంఆర్ఎల్)కు సంబంధించిన పలు అంశాలపై చర్చిం చేందుకు మంగళవారం సీఎం ఉన్నతాధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా అధికారులకు పలు కీలక సూచనలు చేశారు. ఎంజీబీఎస్ నుంచి చాంద్రాయణగుట్ట వరకు 7.5 కిలో మీటర్ల పొడవునా రోడ్డు విస్తరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని ఆయన ఆదేశించారు. ఈ కారిడార్ లో మెట్రో పనులకు సంబంధించి టెండర్ ప్రక్రియను మొదలు పెట్టాలని సూచిం చారు. మెట్రో విస్తరణకు సంబంధించి పెండింగ్ లో ఉన్న భూ సేకరణ పనులను వీలైనంత త్వరగా పూర్తి చేయాలని అన్నారు. హైదరాబాద్ మెట్రోకు రోజు రోజుకు రద్దీ పెరుగుతున్న నేపథ్యంలో దానికి అనుగుణంగా అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. ప్రయాణికుల రద్దీకి తగినట్టుగా మెట్రో రైల్ కు అదనపు బోగీలను జత చేయాలని సూచించారు. ఇందుకు సంబంధించి మెట్రో రైల్ కోచ్‌లను కొనుగోలు చేసేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెట్రో ఫేజ్-2 లో భాగంగా ఎంజీబీఎస్ నుంచి చాంద్రా యణగుట్ట వరకు 7.5 కిలోమీటర్ల కారిడార్ కోసం ప్రస్తుత టెక్నాలజీపై ఢిల్లీ మెట్రోను సంప్రదించి అవసరమైన సలహాలు తీసుకోవాలని అధికారులకు - మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

## 'డ్రగ్ ఫ్రీ తమిళనాడు': సీఎం విజయ్ ప్రతిజ్ఞ





## నా ఓటు తొలగించడం హాస్యాస్పదం : ప్రకాశ్ రాజ్

2లో

## జార్ఖండ్‌లోనూ జంతర్ మంతర్ దృశ్యాలే

- కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే




హైదరాబాద్ - సూర్య వాస్తవం కాక్రోచ్ జనతా పార్టీ ఫౌండర్ అభిజిత్ దీప్కే జార్ఖండ్ విద్యార్థులపై లాఠీచార్జ సంఘటనను తీవ్రంగా ఖండించారు. పోటీ పరీక్షల ప్రశ్నపత్రం లీక్ లను వ్యతిరేకిస్తూ - మిగతా 2లో..

## ఆగస్టు 15ను పండుగలా

# జరుపుకుందాం

(మొదటిపేజీ తరువాయి)

అంటూ దేశ ప్రజల్లో స్ఫూర్తి నింపారు. ఇన్‌స్టాగ్రామ్‌లో ఓ రీల్‌ను షేర్ చేసుకున్న ప్రధాని.. ఆగస్టు 15ను గర్వంగా జరుపుకోవాలని సూచించారు. 'వికసిత్ భారత్' నిర్మాణానికి కృషి చేస్తామని ప్రతిజ్ఞ చేయాలని పిలుపునిచ్చారు. "ప్రతి ఇంటా హర్ ఘర్ తిరంగాను ఓ వేడుకగా మార్చుకుందాం" అని పేర్కొన్నారు. ఇటీవల 'ఎక్స్' వేదికగానూ మోదీ 'హర్ ఘర్ తిరంగా'లో ఉత్సాహంగా పాల్గొనాలని ప్రజలను కోరారు. త్రివర్ణ పతాకం దేశ గర్వానికి ప్రతీక అని తెలిపారు. దేశం కోసం అత్యుత్తమంగా పనిచేయాలనే స్ఫూర్తిని అది అందిస్తుందని పేర్కొన్నారు. ఈ ఏడాది 'హర్ ఘర్ తిరంగా' కార్యక్రమాన్ని 'వందేమాతరం' 150వ వార్షికోత్సవానికి అంకితం చేస్తున్నట్లు ప్రధాని తెలిపారు. దేశభక్తి, త్రివర్ణం పతాకంపై గర్వం, మాతృభూమిపై ప్రేమను చాటేలా కార్యక్రమాన్ని నిర్వహించాలని సూచించారు. 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్'లో భాగంగా ప్రారంభమైన 'హర్ ఘర్ తిరంగా' ద్వారా జాతీయ పతాకంతో ప్రజలకు మరింత వ్యక్తిగత అనుబంధం ఏర్పడేలా ప్రోత్సహిస్తున్నారు.

# పాతబస్తీ మెట్రో పనుల్లో వేగం పెంచాలి

(మొదటిపేజీ తరువాయి)

ముఖ్యమంత్రి దిశా నిర్దేశం చేశారు.

**డిసెంబర్‌లో ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్**

డిసెంబర్ లో నిర్వహించ తలపెట్టిన ఇన్వెస్ట్ తెలంగాణ గ్లోబల్ సమ్మిట్ కు సంబంధించి ముందస్తు ఏర్పాట్లపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అధికారులకు పలు సూచనలు చేశారు. వ్యాపార రంగంలో వివిధ సెక్టార్లలో గుర్తింపు పొందిన ప్రముఖులను సమ్మిట్ లో సన్మానించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ముఖ్యంగా తెలంగాణలో పెట్టుబడులను ఆకర్షించేలా అంతర్జాతీయ ప్రమాణాలతో సమ్మిట్ ఏర్పాట్లు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. గతేడాది నిర్వహించిన సమ్మిట్ లో రాష్ట్రానికి వచ్చిన పెట్టుబడులు, పురోగతికి సంబంధించి పూర్తి వివరాలను నివేదించాలని ఆదేశించారు. పెట్టుబడుల్లో మరింత పురోగతి సాధించేందుకు అవసరమైన ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. ఈ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, స్పెషల్ సీఎస్ జయేష్ రంజన్, ప్రభుత్వ సలహాదారులు రామకృష్ణారావు, ఎన్వీఎస్ రెడ్డి, మెట్రో రైల్ ఎండీ సర్ఫరాజ్ అహ్మద్, అదనపు ఎండీ అజిత్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# కేరళం బిల్లుకు ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

మూజువాణి ఓటుతో ఆమో దించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చా లని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతి పాదనకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును తీసుకొచ్చింది. అయితే, బిల్లుపై చర్చ జరుగుతున్న సమయంలో విపక్ష సభ్యులు సభలో ఆందోళనకు దిగారు. ఢిల్లీ జంతర్ మంతర్ వద్ద విద్యార్థులపై పోలీస్ చర్యలకు గాను పార్లమెంట్‌లో కేంద్ర హోంమంత్రి అమిత్ షా సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్షాలు ఆందోళనకు దిగాయి.

# జార్ఖండ్‌లోనూ జంతర్ మంతర్ దృశ్యాలే

(మొదటిపేజీ తరువాయి)

రాంచీలో శాంతియుతంగా నిరసన తెలుపుతున్న విద్యార్థులపై టీయర్ గ్యాస్, లాఠీచార్జ్ ఎందుకు చేస్తున్నారని ఆయన ప్రశ్నించారు. రాజకీయేతర నిరసనలపై ఈ తరహా పద్ధతులు అనుసరించడమేంటని మండిపడ్డారు. జార్ఖండ్‌లో జరిగిన ఘటన చాలా దురదృష్టకరం. 20వ తేదీన జంతర్ మంతర్ వద్ద మనం చూసిన దృశ్యాలే జార్ఖండ్‌లోనూ కనిపించాయి, అక్కడ విద్యార్థులపై బాష్పవాయువును ప్రయోగించారు. లాఠీలతో విచక్షణారహితంగా దాడి చేశారు. రాజకీయ పార్టీలు నిరసనలు చేపట్టినప్పుడు లాఠీచార్జీలు లేదా బాష్పవాయువు ప్రయోగం వంటి చర్యలు ఎందుకు చేపట్టరో నాకు అర్థం కావడం లేదు. కేవలం విద్యార్థులపైనే బాష్పవాయువును, లాఠీలతో ఎందుకు దాడి చేస్తున్నారు?" అని దీప్కే ఆందోళన వ్యక్తం చేశారు.

# నా ఓటు తొలగించడం హాస్యాస్పదం : ప్రకాశ్ రాజ్

**బెంగళూరు – సూర్య వాస్తవం:** బెంగళూరులో గల్లంతైన 65 లక్షల ఓట్లలో తన ఓటు కూడా ఉన్నదని, ఇది చాలా హాస్యాస్పదంగా అనిపిస్తోందని సినీనటుడు ప్రకాశ్ రాజ్ తెలిపారు. ఈ విషయంపై ఆయన సోషల్ మీడియాలో ఓ సెల్ఫీ వీడియోను పంచుకున్నారు. ప్రత్యేక సమగ్ర సవరణ (సర్) పై ఆయన మాట్లాడుతూ .... తాను పుట్టి పెరిగిన నియోజకవర్గంలో తన ఓటును తొలగించడం హాస్యాస్ప దంగా ఉందని అన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ తర్వాత బెంగళూరు నియోజ కవర్గంలో తొలగించిన 65 లక్షల ఓట్లలో తనది కూడా ఉన్నదని ప్రకాశ్ రాజ్ తెలిపారు. తాను బెంగళూరు నియోజకవర్గంలోనే పుట్టానని, ఇక్కడే నివసించానని, చదువంతా ఇక్కడే పూర్తయిందని, నటన నేర్చుకున్నది కూడా ఇక్కడేనని తెలిపారు. అన్నిటికంటే ముఖ్యంగా తాను ఈ నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా కూడా పోటీ చేశానని వెల్లడించారు. అయినా తన ఓటు తొలగించారని ఆశ్చర్యాన్ని వ్యక్తం చేశారు.

# 'డ్రగ్ ఫ్రీ తమిళనాడు': సీఎం విజయ్ ప్రతిజ్ఞ

**హైదరాబాద్ – సూర్య వాస్తవం:** తమిళనాడును డ్రగ్ రహిత రాష్ట్రంగా మార్చేందుకు సీఎం విజయ్ పిలుపునిచ్చారు. మంగళవారం 'డ్రగ్ ఫ్రీ తమిళనాడు' కార్యక్రమంలో పాల్గొన్న ఆయన.. చెన్నైలో విద్యార్థులతో కలిసి మత్తు పదార్థాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించారు. సమాజం నుంచి డ్రగ్స్‌ను పూర్తిగా నిర్మూలించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. మత్తు పదార్థాలు వినియోగిస్తున్నట్లు గుర్తిస్తే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలని సీఎం విజయ్ ప్రజలకు పిలుపునిచ్చారు. యువత డ్రగ్స్‌కు దూరంగా ఉండి ఆరోగ్యకరమైన భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని సూచించారు.

# అమిత్ షా పార్లమెంట్‌కు రావాలి

(మొదటిపేజీ తరువాయి)

నినాదాలతో మకర ద్వారం వద్ద ఆందోళన చేపట్టారు. ఇంతలో, అక్కడ నిరసన చేస్తున్న ప్రతిపక్ష ఎంపీలకు వ్యతిరేకంగా అధికార పార్టీ ఎంపీలు నినాదాలు చేయడం ప్రారంభించారు. దీంతో భద్రతా అధికారులు పాలక, ప్రతిపక్ష పార్టీల మధ్య 'గోడ' నిర్మించాల్సి వచ్చింది. మరోవైపు వర్షాకాల సమావేశాలు ముగియడానికి రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్నప్పటికీ... ప్రధాని, హోంమంత్రి సభకు వచ్చి ప్రతిపక్షాన్ని ఎదుర్కొనే ధైర్యం చేయకపోవడం గమనార్హం.

**అమిత్ షాను తప్పుడు కథలు ప్రచారం చేయడానికి అనుమతించం**

మంగళవారం లోక్‌సభలో ప్రతిష్టంభన కొనసాగింది. సభను స్పీకర్ ఓం బిర్లా ప్రారంభిస్తూ ప్రశ్నోత్తరాల నిర్వహించడానికి ప్రయత్నించారు. అయితే రామ మందిర దోపిడీపై చర్చ జరపాలని డిమాండ్ చేస్తూ ప్రతిపక్ష ఎంపీలు వెల్‌లోకి దూసుకెళ్లి ఆందోళన చేపట్టారు. సమావేశాల నిర్వహణకు సహకరించాలని స్పీకర్ ఓంబిర్లా కోరారు. సభలో పలుమార్లు అంత రాయాలు కలిగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. సభలో మనం చర్చలు, సంప్రదింపులు జరపాలని సూచించారు. కేంద్ర హోం మంత్రి సమాధానం ఇస్తారని అన్నప్పుడు ఎందుకు ఆందోళన చేస్తున్నారని ప్రశ్నించారు. దీనికి ప్రతిపక్షాలు స్పందిస్తూ విద్యార్థులపై క్రూరమైన దాడి, విరాళాల దోపిడీ రెండూ ముఖ్యమైన అంశాలని, రెండింటిపై చర్చ జరిగేలా ప్రభుత్వం హామీ ఇవ్వాలని డిమాండ్ చేశాయి. కేంద్ర హోం మంత్రి సభకు వచ్చి సమాధానం చెప్పాల్సిందేనని ప్రతిపక్షాలు తమ ఆందోళనను కొనసాగించాయి. విద్యార్థులపై క్రూరమైన దాడి గురించి అమిత్ షా చెప్పే 'రంగుల కథలు' వినడానికి తమకు ఆసక్తి లేదని ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. జంతర్ మంతర్ వద్ద విద్యార్థులను అణచివేసేందుకు జరిగిన క్రూరమైన ప్రయత్నానికి ఎవరు బాధ్యులు అనే ప్రశ్నకు సమాధానం దొరకాలని కోరాయి.

అమిత్ షాను తప్పుడు కథలు ప్రచారం చేయడానికి అనుమతించబోమని కూడా ప్రతిపక్షాలు స్పష్టం చేశాయి. దీంతో స్పీకర్ బిర్లా సభను మధ్యాహ్నం 2 గంటల వరకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలో ప్రతిపక్షాల ఆందోళన మధ్యే కేరళ పేరు మార్పు బిల్లు, నేషనల్ కోఆపరేటివ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ సవరణ బిల్లును ఎటువంటి చర్చా లేకుండా మూజువాణి ఓటుతో ఆమోదించుకున్నారు.

**కేరళ పేరును కేరళంగా మార్చే బిల్లు**

కేరళ రాష్ట్రం పేరును కేరళంగా మార్చేందుకు ఉద్దేశించిన బిల్లును సభలో హోం మంత్రి అమిత్ షా ప్రవేశపెడతారని ప్రకటించినప్పటికీ... ఆ శాఖ సహాయ మంత్రి నిత్యానంద రాయ్ ప్రవేశపెట్టారు. ప్రతిపక్ష సభ్యుల ఆందోళనల మధ్యే బిల్లును సభలో ప్రవేశపెట్టి మూజువాణి ఓటుతో ఆమోదించారు. రాష్ట్రం పేరును కేరళంగా మార్చాలని కోరుతూ కేరళ ప్రభుత్వం చేసిన ప్రతిపాదనకు అనుగుణంగా కేంద్రం ఈ బిల్లును తీసుకొచ్చింది. రాష్ట్ర అధికారిక పేరును మలయాళంలో 'కేరళం'గా ఉపయోగిస్తున్న నేపథ్యంలో అదే పేరును రాజ్యాంగపరంగానూ అమలు చేయాలన్న డిమాండ్ చాలాకాలంగా ఉంది. ఈ నేపథ్యంలో కేంద్రం తీసుకొచ్చిన సవరణ బిల్లుకు లోక్‌సభ ఆమోదం లభించింది.

**జాతీయ సహకార అభివృద్ధి బిల్లు**

జాతీయ సహకార అభివృద్ధి సంస్థ సవరణ బిల్లు కూడా లోక్‌సభ చర్చ లేకుండానే ఆమోదం పొందింది. దేశవ్యాప్తంగా ఉన్న సహకార సంఘాలపై జాతీయ సహకార అభివృద్ధి సంస్థ పట్టును మరింత బిగించే నిబంధనలున్న ఈ బిల్లును... సహకార శాఖ ఇన్‌చార్జిగా ఉన్న అమిత్ షా ప్రవేశపెట్టాల్సి ఉంది. ఆయన గైర్హాజరీలో, సహాయ సహకార శాఖ మంత్రి మురళీధర్ మోహోల్ ఈ బిల్లును ప్రవేశపెట్టారు. ఈ బిల్లు ఆమోదం అనంతరం సభను నేటి (బుధవారం)కి వాయిదా వేశారు.

**రాజ్యసభలో ట్రిబ్యునల్ సంస్కరణల బిల్లు ఆమోదం**

రాజ్యసభలో కూడా ప్రతిపక్షాల ఆందోళన కొనసాగింది. సభను చైర్మెన్ సిపి రాధాకృష్ణన్ ప్రారంభించారు. వెంటనే ప్రతిపక్ష సభ్యులు ఆందోళన చేపట్టారు. రామ మందిర దోపిడీపై ప్రధాని మోడీ, జంతర్ మంతర్ వద్ద విద్యార్థుల దాడిపై హోంమంత్రి సమాధానం చెప్పాలని డిమాండ్ చేస్తూ నినాదాలు హోరెత్తించారు.

దీంతో చైర్మెన్ సభను మధ్యాహ్నం 12 గంటలకు వాయిదా వేశారు. తిరిగి ప్రారంభమైన సభలోనూ ప్రతిపక్షాల ఆందోళనతో సభను మధ్యాహ్నం 2 గంటలకు వాయిదా వేశారు. అనంతరం ప్రారంభమైన సభలో ట్రిబ్యునల్ సంస్కరణల బిల్లును ఆమోదించారు. దేశంలోని వివిధ ట్రిబ్యునల్స్‌కు చైర్‌పర్సన్‌లు, సభ్యులను ఎన్నుకోవడానికి ఈ బిల్లును మూజువాణి ఓటుతో ఆమోదించారు. అనంతరం సభను నేటి (బుధవారం)కి వాయిదా వేశారు.

# సామాన్యుడిపై ధరల భారం వద్దు..

(మొదటిపేజీ తరువాయి)

పరిశ్రమలు, సేవా రంగాల్లో గణనీయమైన వృద్ధి నమోదైంది. 2025–26 రెండో త్రైమాసికంలో వ్యవసాయ రంగం 13.5 శాతం, పారిశ్రామిక రంగం 10.6 శాతం, సేవా రంగం 9.9 శాతం చొప్పున వృద్ధి సాధించి రాష్ట్ర ఆర్థిక వ్యవస్థకు మూలస్తంభాలుగా నిలిచాయి. పశు సంవర్ధక శాఖలో మాంసం, గుడ్ల ఉత్పత్తి పెరగడంతో పాటు, ఐటీ, రవాణా, వాణిజ్య కార్యకలాపాలు ఊపందుకున్నాయి. టెక్నాలజీ వినియోగంతో జీఎస్టీ వసూళ్లు 21 శాతం పెరిగి రూ.13,282 కోట్లకు చేరగా, రాష్ట్రంలో పెట్టుబడుల ప్రవాహం కూడా ఆశాజనకంగా ఉంది. రూ.2.88 లక్షల కోట్ల విలువైన మెగా ప్రాజెక్టులు, రూ.60 వేల కోట్ల ఎంఎస్ఎంఈ పెట్టుబడులు గ్రౌండింగ్‌లో మంచి వృద్ధిని కనబరిచాయి.

**ఎల్ నినో సవాల్.. సీఎం దిశానిర్దేశం**

ఈ ఆర్థిక ప్రగతిపై సంతృప్తి వ్యక్తం చేసినప్పటికీ, ఎల్ నినో ప్రభావంపై ముఖ్యమంత్రి చంద్రబాబు ఆందోళన వ్యక్తం చేశారు. "రాష్ట్రంలో లోటు వర్షపాతం ఉంది. కృష్ణా నదిలో ప్రవాహాలు లేక శ్రీశైలం, నాగార్జున సాగర్ ప్రాజెక్టులు నిండలేదు. గోదావరి జలాలను కృష్ణా డెల్టాకు మళ్లించి ఆదుకున్నాం. భూగర్భ జలాలు కూడా తగ్గుతున్నాయి. ఈ పరిస్థితుల్లో జీఎస్‌డీపీ పడిపోకుండా అన్ని శాఖలు సమ న్వయంతో పనిచేయాలి" అని ఆయన సూచించారు. ప్రజలపై ఎలాంటి ధరల భారం పడకుండా చూసేందుకు తక్షణమే ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సీఎం ఆదే శించారు. "సామాన్యుడిపై భారం పడకూడదు. నీటి లభ్యత, ఉత్పత్తులకు విలువ జోడింపు వంటి అంశాలపై తగిన ప్రణాళికలు సిద్ధం చేయాలి. వాణిజ్య పన్నుల శాఖ మాదిరిగా అన్ని శాఖల్లో టెక్నాలజీని వాడి లక్ష్యాలు సాధిం చాలి" అని స్పష్టం చేశారు. జిల్లా, నియోజకవర్గం, మండ లాల వారీగా నివేదికలు సిద్ధం చేస్తే లక్ష్య సాధన సులభమ వుతుందని తెలిపారు. అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి అయ్యే ఉత్పత్తులపై ప్రభావం పడకుండా చూడాలని, మొత్తంగా రాష్ట్రాన్ని 15 శాతం వృద్ధిరేటు దిశగా నడి పించేందుకు అవసరమైన సమగ్ర కార్యాచరణ చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షలో ఆర్థిక, ప్రణా ళికా శాఖ ముఖ్యకార్యదర్శి పీయూష్ కుమార్, ప్రణాళికా విభాగం ఈడీ వీఆర్ అలపర్తి, సీఎంఓ అధికారులు పాల్గొన్నారు.

# కంటెయినర్‌లో ట్రంప్?

- బ్రిటన్ పర్యటనలో బయటపడిన ట్రంప్ మేకపోతు గాంభీర్యం - ఇరాన్ పేరు చెబితేనే వణుకు !
- క్యాటరింగ్ కంటెయినర్‌లో దాచి రహస్య విమానంలో పంపిన అధికారులు



**వాషింగ్టన్ – సూర్య వాస్తవం:**

'ఇరాన్‌ను నామరూపాలు లేకుండా చేస్తాను', 'ఇక ఇరాన్‌పై భీకర యుద్ధమే', 'రెండో ప్రపంచయుద్ధం తర్వాత ఇంతటి తీవ్రమైన పోరు ఎన్నడూ చూసి ఉండరు'...అంటూ గతంలో ఎన్నో సందర్భాలలో బీరాలు పలికిన అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాస్తవానికి టెహ్రాన్ పేరు చెబితేనే వణికిపోతారు. అత్యంత భద్రతా ఏర్పాట్ల నడుమ, శత్రు దుర్భేధ్యమైన ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో ప్రయాణించే ట్రంప్‌నకు ఇరాన్ భయం పట్టుకుందంటే ఆశ్చర్యం కలుగుతోంది కదూ...అసలు ఏం జరిగిందంటే గత నెలలో టర్కీ నుంచి బ్రిటన్‌కు ఆయన ప్రయాణించాల్సి వచ్చింది. తనను హతమారు స్తానంటూ ఇరాన్ చేసిన హెచ్చరికలకు భీతిల్లిన ట్రంప్ మహాశయుడిని విమానాశ్రయంలోని క్యాటరింగ్ కంటెం యినర్‌లో దాచి పెట్టి 'రహస్య విమానం'లో పంపారు.

**ఏం జరిగింది?**

వాషింగ్టన్ పోస్ట్, న్యూయార్క్ టైమ్స్ పత్రికల కథనం ప్రకారం... నాటో శిఖరాగ్ర సమావేశానికి హాజరయ్యేందుకు ట్రంప్ అంకారాలో ఉన్నప్పుడు ఈ ఘటన జరిగింది. టెలివిజన్ కెమేరాల ఎదుటే ఆయన పాత ఎయిర్ ఫోర్స్ వన్ జంబో జెట్ ఎక్కారు. ఆ తర్వాత కొద్ది నిమిషాలకు అంటే విమానం బయలుదేరడానికి ముందు భోజనం, ఇతర సామగ్రిని లోడ్ చేయడానికి ఉపయోగించే విమానాశ్రయ క్యాటరింగ్ ట్రక్కులో ఆయనను ఉంచి రహస్యంగా ఓ చిన్న విమానంలోకి పంపారు. అసలు ట్రంప్ ఎక్కడ ఉన్నారో పాత్రికేయులకు, కొంతమంది అధ్యక్ష భవనం అధికారులకు కూడా చెప్పలేదు. ట్రంప్‌నకు ఇరాన్ నుంచి ఎదురైన ముప్పు కారణంగానే ఈ 'ఆపరేషన్' చేపట్టాల్సి వచ్చిందని ఓ అధికారి చెప్పారు. పాత ఎయిర్‌ఫోర్స్ వన్‌లో ట్రంప్‌తో పాటే ప్రయాణి స్తున్నామని అనుకుంటున్న పాత్రికేయులకు ప్రెస్ క్యాబిన్‌లోని కిటికీ తెరలను మూసి ఉంచాలని అధికారులు సూచించారు. కొంతమంది అధ్యక్ష భవనం సిబ్బంది కూడా ట్రంప్ ఆ విమానంలోనే ఉన్నారని నమ్మారు.

**ప్రమాదాన్ని ఎదుర్కోవడానికే...**

మూడో విమానంలో ట్రంప్ చేసిన రహస్య ప్రయాణం గురించి వైట్‌హౌస్ కమ్యూనికేషన్స్ డైరెక్టర్ స్టీవ్ చెంగ్ ఓ ప్రకటన చేశారు. అమెరికాను చాలామంది శత్రువులు లక్ష్యంగా చేసుకున్నారని, ఆ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి అందుబాటులో ఉన్న ప్రతి సాధనాన్నీ ఉపయోగిస్తామని ఆయన తెలిపారు.

**చెప్పిందొకటి... చేసిందొకటి**

ట్రంప్ జూలై 8న అప్పటి ఎయిర్ ఫోర్స్ వన్ విమానంలో టర్కీ నుంచి బయలుదేరారని ప్రభుత్వం గతంలో చెప్పింది. ఖతార్ బహుకరించిన కొత్త బోయింగ్ 747–8 విమానాన్ని కాకుండా తన ఎయిర్ ఫోర్స్ వన్ విమానాన్నే ఉపయోగిస్తానని ట్రంప్ తన ట్రూత్ సోషల్ పోస్టులో కూడా రాశారు. టర్కీకి సరిహద్దున ఉన్న ఇరాన్‌తో శత్రుత్వం తీవ్రమవుతున్న సమయంలో నాటో సదస్సుకు హాజరయ్యేందుకు ట్రంప్ తొలిసారిగా కొత్త విమానంలో అంతర్జాతీయ ప్రయాణం చేశారు. అంకారా నుంచి బయలుదేరే ముందు ట్రంప్ ట్రూత్ సోషల్‌లో ఓ పోస్ట్ పెడుతూ బ్రిటన్‌లోని ఆర్ఏఎఫ్ మిల్డెన్‌హాల్ స్థావరానికి చేరుకునేందుకు పాత జ్ఞాపకాలకు గుర్తుగా లేత నీలి రంగు ఎయిర్ ఫోర్స్ వన్‌నే ఉపయోగిస్తా నని, అదే సమ యంలో ఆ స్థావరంలో అమెరికా సైనికులు చూసేందుకు వీలుగా కొత్త విమానం కూడా ఆగుతుందని రాశారు.

**2000లో కూడా...**

2000వ సంవత్సరంలో కూడా ఇలాంటి ఆపరేషనే జరిగింది. ఆ సమయంలో అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్ అందరినీ మభ్యపెట్టేందుకు ఎయిర్ ఫోర్స్ వన్ విమానాన్ని పంపి తాను మాత్రం ఎగ్జిక్యూటివ్ జెట్‌లో ప్రయాణించి పాకిస్తాన్ చేరారు.

**ట్రంప్ ఏం చేశారంటే...**

విమాన ప్రయాణంలో కిటికీ తెరలను ఎందుకు మూసి ఉంచుకోవాల్సి వచ్చిందని విలేకరులు ఆ తర్వాత అడిగిన ప్రశ్నకు ట్రంప్ బదులిస్తూ ప్రమాదకరమైన విమానంలో ప్రయాణిస్తున్నారు కాబట్టే అలా చేశామని చెప్పారు. 'నేను వెళితే మీరూ వెళ్లాలి కదా?' అని అన్నారు. ట్రంప్‌ను తీసుకొని వెళ్లిన సీ–32ఏ విమానం స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10.20 గంటలకు బ్రిటన్ చేరుకుంది. ఆ తర్వాత కొద్ది నిమిషాలకు పాత ఎయిర్ ఫోర్స్ వన్ విమానం, మీడియా అక్కడికి చేరుకున్నాయి. ట్రంప్ తాను ప్రయాణించిన మూడో విమానం నుంచి ఓ వాహనంలో పాత ఎయిర్ ఫోర్స్ విమానం వద్దకు చేరుకున్నారు. వేరొక ప్రవేశం ద్వారా దానిలోకి ప్రవేశించి ఎప్పటి మాదిరిగానే పై ఎడమ వైపు తలుపు నుంచి మెట్లు దిగి నడిచారు. స్థానిక కాలమానం ప్రకారం రాత్రి 10.56 గంటలకు విలే కరులకు శాంతి చిహ్నాన్ని చూపించారు. కానీ వారితో ము చ్చటించలేదు. తర్వాత ఖతార్ ఇచ్చిన విమానం వైపు నడ వడానికి ముందు కొద్దిసేపు సైనికులను పలకరించారు.

## సంపాదకీయం

# ఖరీఫ్ కోలుకుంది... మరి రబీ




ఎల్‌నినో బలపడుతోంది.. జూన్‌లో వర్షాలు దారుణంగా పడిపోయాయి.. ఖరీఫ్ సాగు గతేడాదితో పోలిస్తే భారీగా వెనుకబడింది. దీంతో ఈ ఏడాది పంటల దిగుబడిపై ఆందోళన మొదలైంది. కానీ జూలైలో పరిస్థితి అనూహ్యంగా మారిపోయింది. నైరుతి రుతుపవనాలు ఒక్కసారిగా పుంజుకోవడంతో వర్షాలు ఊపందుకున్నాయి. ఫలితంగా ఖరీఫ్ సాగు లోటు బాగా తగ్గింది.. ముఖ్యంగా రబీ పంటలపై ఎల్‌నినో ప్రభావం ఉండే అవకాశం ఆందోళన కలిగిస్తోంది.ఈ ఏడాది నైరుతి రుతుపవనాల ప్రారంభం వ్యవసాయ రంగానికి నిరాశ కలిగించింది. ఎల్‌నినో సముద్ర ఉపరితల ఉష్ణోగ్రతలను మాత్రమే మార్చదు. వాతావరణంలోని గాలి, పీడన వ్యవస్థలపై కూడా ప్రభావం చూపుతుంది. అయితే ఈ ప్రభావం వెంటనే కనిపించదు. సాధారణంగా ఒకటి నుంచి రెండు నెలల ఆలస్యం ఉండొచ్చు. అందువల్ల జూలైలో వర్షాలు బాగా పడ్డాయని ఎల్‌నినో ప్రభావం ముగిసిపోయిందని భావించడం తప్పు. రుతుపవనాలపై దాని ప్రతికూల ప్రభావం ముందుముందు కనిపించే అవకాశం ఉంది.ఎల్‌నినో బలపడితే ఉష్ణోగ్రతలు కూడా పెరిగే అవకాశం ఉంటుంది. అదే జరిగితే రబీ సీజన్ పంటలపై ప్రభావం పడొచ్చు. ముఖ్యంగా గోధుమ, ఆవాలు, బంగాళాదుంప వంటి పంటలకు తక్కువ వ్యవధి ఉండే వేడి శీతాకాలం అనుకూలం కాదు. అంటే ఈ ఏడాది ఖరీఫ్ పంటలు అనుకున్నంత దెబ్బతినకపోయినా.. రబీ సీజన్‌లో అసలు సవాలు ఎదురయ్యే అవకాశం ఉంది.వ్యవసాయానికి వాతావరణ ముప్పుతో పాటు ప్రపంచ మార్కెట్లలో ఆహార ధరల పరిస్థితి కూడా భారత్‌కు సవాలుగా మారుతోంది. ఐక్యరాజ్యసమితి ఆహార, వ్యవసాయ సంస్థ (ఎఫ్ఏఓ) ఆహార ధరల సూచీ జూలైలో 131.1 పాయింట్లకు చేరింది. ఇది జూన్‌తో పోలిస్తే పెరుగుదల మాత్రమే కాదు.. మూడున్నరేళ్ల గరిష్ఠ స్థాయికి చేరిన సూచీ. అయితే ఈ పెరుగుదలలో ప్రధాన పాత్ర పోషించింది వంటనూనెల ధరలు. జూలైలో ఎఫ్ఏఓ వెజిటబుల్ ఆయిల్స్ ఇండెక్స్ ఏడాది ప్రాతిపదికన 17.3 శాతం పెరిగింది. 2022 జూన్ తర్వాత ఇదే అత్యధిక స్థాయి.అంతర్జాతీయంగా పెట్రోలియం ధరలు పెరిగితే.. పామాయిల్, రేప్‌సీడ్ ఆయిల్, సోయాబీన్ ఆయిల్ వంటి వంటనూనెలను బయోఫ్యూయల్ తయారీలో ఉపయోగించేందుకు ప్రోత్సాహం పెరుగుతుంది. దీంతో ఆహార అవసరాలకు అందుబాటులో ఉండే నూనెలపై ఒత్తిడి పెరిగి ధరలు మరింత పెరిగే అవకాశం ఉంటుంది.జూన్‌లో దేశవ్యాప్తంగా సాధారణ దీర్ఘకాల సగటు వర్షపాతం (ఎల్‌పీఏ) కంటే 38 శాతం తక్కువ వర్షాలు నమోదయ్యాయి. సాధారణంగా జూన్‌లో సుమారు మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడి వర్షాలను తీసుకొస్తాయి. అవి సగటున 11 రోజుల పాటు ప్రభావం చూపుతాయి.

కానీ ఈ ఏడాది జూన్‌లో ఒక్క అల్పపీడన వ్యవస్థ కూడా ఏర్పడలేదు. దీంతో 1901 తర్వాత దేశంలో అత్యంత తక్కువ వర్షపాతం నమోదైన జూన్ నెలల్లో ఇది ఆరో స్థానంలో నిలిచింది. ఇంతటి లోటు వర్షపాతం నమోదైన సమయంలో ఎల్‌నినో ఇంకా బలహీన–మోస్తరు దశలోనే ఉండటం గమనార్హం.వర్షాలు ఆలస్యం కావడంతో పంటల సాగు కూడా మందగించింది. జూలై 6 నాటికి దేశంలో ఖరీఫ్ పంటలు కేవలం 350.85 లక్షల హెక్టార్లలో మాత్రమే సాగయ్యాయి. గత ఏడాది ఇదే సమయానికి 442.80 లక్షల హెక్టార్లలో పంటలు సాగయ్యాయి. అంటే సాగు విస్తీర్ణం గతేడాదితో పోలిస్తే 20.8 శాతం తక్కువగా ఉంది. నూనెగింజల విషయంలో లోటు మరింత ఎక్కువగా ఉండగా.. పప్పుధాన్యాల్లో 21.8 శాతం, పత్తిలో 23 శాతం వరకు సాగు తగ్గింది. నూనెగింజలు, పప్పుధాన్యాలు, పత్తి వంటి పంటల విషయంలో సాగు తగ్గితే దేశీయ ఉత్పత్తిపై ప్రభావం పడటంతో పాటు దిగుమతులపై ఆధారపడాల్సిన పరిస్థితి పెరుగుతుంది.ఎల్‌నినో జూలైలో బలహీన–మోస్తరు స్థాయి నుంచి మోస్తరు–బలమైన స్థాయికి చేరినా.. నైరుతి రుతుపవనాలు మాత్రం బలంగా పుంజుకున్నాయి. జూలైలో సాధారణంగా మూడు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడాల్సి ఉండగా.. ఈసారి నాలుగు అల్పపీడన వ్యవస్థలు ఏర్పడ్డాయి. అంతేకాదు.. ఇవి నెమ్మదిగా కదలడంతో ఎక్కువ కాలం వర్షాలను కురిపించాయి. సాధారణంగా అల్పపీడన వ్యవస్థల ప్రభావం సుమారు 14 రోజులు ఉండగా.. జూలైలో ఇది దాదాపు 24 రోజులకు చేరింది. దీంతో జూలైలో దేశవ్యాప్తంగా వర్షపాతం సాధారణం కంటే 2.4 శాతం ఎక్కువగా నమోదైంది. ఇది భారత వాతావరణ విభాగం అంచనాలకు కూడా భిన్నంగా ఉండటం విశేషం. జూలైలో వర్షాలు సాధారణం కంటే తక్కువగా ఉండే అవకాశం ఉందని ఐఎండీ అంచనా వేసింది. కానీ వాస్తవ పరిస్థితి అందుకు భిన్నంగా మారింది.జూలై చివరి నాటికి దేశంలో ఖరీఫ్ పంటల సాగు విస్తీర్ణం 894.22 లక్షల హెక్టార్లకు చేరింది. గతేడాది ఇదే సమయంతో పోలిస్తే ఇప్పుడు సాగు విస్తీర్ణం కేవలం 2.9 శాతం మాత్రమే తక్కువగా ఉంది. అం

టే జూన్‌లో 20.8 శాతంగా ఉన్న సాగు లోటు.. జూలై చివరికి కేవలం 2.9 శాతానికి తగ్గిపోయింది. పప్పుధాన్యాల్లో సాగు లోటు 6.3 శాతానికి, పత్తిలో 2.4 శాతానికి తగ్గింది. నూనెగింజల సాగు మాత్రం గతేడాది స్థాయిని కూడా అధిగమించింది. ముఖ్యంగా వేరుశనగ, నువ్వుల సాగు మెరుగుపడింది.జూలై మూడో, నాలుగో వారాల్లో కురిసిన వర్షాలు ఇప్పటికే విత్తిన పంటలకు కూడా ఊపిరి పోశాయని మహారాష్ట్రలోని లాతూర్‌కు చెందిన ప్రముఖ పప్పుల మిల్లర్ నితిన్ కలంత్రికి తెలిపారు. వర్షాల లోటుతో తేమ ఒత్తిడిని ఎదుర్కొంటున్న పంటలకు ఈ వర్షాలు ఎంతో ఉపశమనం కలిగించాయని ఆయన పేర్కొన్నారు. ఈ వర్షాలు లేకపోతే మొక్కల్లో వేర్లు, కాండం, ఆకుల పెరుగుదల వంటి వృక్ష దశ అభివృద్ధి దెబ్బతినేదని వివరించారు.సోయాబీన్ పంట పరిస్థితి కూడా మెరుగుపడింది.ఖరీఫ్ పంటలకు ఆగస్టు, సెప్టెంబర్ తొలి వారాల్లో కూడా వర్షాలు అవసరం. ఈ దశలో పంటలు పూత దశకు, గింజలు లేదా కాయలు ఏర్పడే దశకు చేరుకుంటాయి. ఈ సమయంలో తగినంత తేమ లేకపోతే చివరికి దిగుబడిపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది.ఐఎండీ ప్రకారం ఆగస్టు 13 ప్రాంతంలో ఉత్తర బంగాళాఖాతం, పశ్చిమ బెంగాల్–బంగ్లాదేశ్ తీర ప్రాంతాలను ఆనుకుని మరో అల్పపీడన వ్యవస్థ ఏర్పడే అవకాశం ఉంది.అక్టోబర్–డిసెంబర్ మధ్య ఎల్‌నినో చాలా బలమైన దశకు చేరే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. అంతేకాదు.. 2027 మార్చి వరకు శీతాకాలం, వసంతకాలంలో కూడా ఎల్‌నినో పరిస్థితులు కొనసాగవచ్చని అంచనా. ఇది భారత వ్యవసాయానికి రెండు రకాల ముప్పులను తెచ్చే అవకాశం ఉంది.



- శ్వేత విప్లవానికి గడ్డుకాలం
- పెరుగుతున్న దాణా ధరలు..
- తగ్గుతున్న పాడి రైతుల ఆదాయం
- పాడి రైతులకు ప్రత్యేక సబ్సిడీలు, ప్రోత్సాహకాలు అవసరం
- పాడి పరిశ్రమను ఆదుకుంటేనే గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలం
- ప్రభుత్వ పథకాలు ఉన్నా.. రైతులకు అందనిప్రయోజనాలు

# పాడి పరిశ్రమకు ఊతమేది..?

**అనంతపురం ప్రతినిధి – సూర్య వాస్తవం:**

వ్యవసాయానికి అనుబంధ రంగాల్లో అత్యంత కీలకమైన పాడి పరిశ్రమ నేడు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. పెరుగుతున్న దాణా, పశుగ్రాసం ధరలు.. గిట్టుబాటు కాని పాల ధరలు.. పశువైద్య సేవల్లో లోపాలు.. ప్రభుత్వ ప్రోత్సాహం కొరవడటం.. వెరసి పాడి రైతుల జీవనం భారంగా మారుతోంది.దేశంలో కోట్లాది మంది చిన్న, సన్నకారు రైతులు, భూమిలేని వ్యవసాయ కూలీలు, మహిళా స్వయం సహాయక సంఘాలు పాడి పరిశ్రమపై ఆధారపడి జీవిస్తున్నారు. పంటలు విఫలమైన సందర్భాల్లోనూ కుటుంబ ఆర్థిక వ్యవస్థకు అండగా నిలిచిన పాడి పరిశ్రమ ప్రస్తుతం రైతులకు ఆశించిన స్థాయిలో ఆదాయాన్ని అందించలేకపోతోంది.

**పథకాలు ఉన్నా.. ప్రయోజనం ఎంత?**

పాడి పరిశ్రమ అభివృద్ధి కోసం ఆత్మనిర్భర్ భారత్ ప్యాకేజీ, నేషనల్ లైవ్‌స్టాక్ మిషన్, యానిమల్ హస్బెండరీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఫండ్ వంటి పథకాలను ప్రభుత్వం ప్రకటించింది. అయితే వీటి ప్రయోజనాలు చిన్న, సన్నకారు పాడి రైతులకు ఆశించిన స్థాయిలో అందడం లేదనే విమర్శలు ఉన్నాయి. మౌలిక సదుపాయాల అభివృద్ధికి వేల కోట్ల రూపాయలు కేటాయిస్తున్నప్పటికీ, గ్రామీణ స్థాయిలో పాడి రైతుల జీవన పరిస్థితుల్లో గణనీయమైన మార్పు కనిపించడం లేదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దాణా ధరల పెరుగుదలతో భారం ప్రస్తుతం పాడి రైతులను తీవ్రంగా ఇబ్బంది పెడుతున్న ప్రధాన సమస్య పశువుల దాణా, పశుగ్రాసం ధరల పెరుగుదల. పచ్చగడ్డి కొరత, ఎండుగడ్డి ధరలు పెరగడంతో పశువుల పెంపకం ఖర్చు భారీగా పెరిగింది. ఒకప్పుడు రూ.600గా ఉన్న తౌడు బస్తా ధర ప్రస్తుతం రూ.700కు చేరగా, ట్రాక్టర్ ఎండుగడ్డి ధర రూ.12 వేల నుంచి రూ.15 వేల వరకు పలుకుతోంది. దీంతో పాల ఉత్పత్తి వ్యయం గణనీయంగా పెరిగింది.రోజుకు నాలుగు లీటర్ల పాలు ఇచ్చే గేదెకు అవసరమైన దాణాపైనే సుమారు రూ.100 వరకు ఖర్చవుతోందని రైతులు చెబుతున్నారు. పశువుల సంరక్షణ, వైద్య ఖర్చులు, కూలి, విద్యుత్తు, నీటి వ్యయాలను కలిపి చూస్తే పలువురు రైతులు రోజువారీగా నష్టాలను చవిచూస్తున్న పరిస్థితి నెలకొంది.

**పాల ధరకు.. ఉత్పత్తుల ధరకు వ్యత్యాసం**

డెయిరీలు పాల ఉత్పత్తుల ధరలను తరచూ పెంచుతున్నప్పటికీ, రైతుల నుంచి సేకరించే పాల ధరలను అదే స్థాయిలో పెంచడం లేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. విజయ డెయిరీతో పాటు హెరిటేజ్, హాట్సన్, తిరుమల, శ్రీచక్ర, గాయత్రి తదితర డెయిరీల విషయంలోనూ రైతులు గిట్టుబాటు ధర కోసం డిమాండ్ చేస్తున్నారు.గ్రామీణ ప్రాంతాల్లో డెయిరీల మధ్య పోటీ ఉన్నప్పటికీ, ఆ పోటీ ప్రయోజనం పాల ఉత్పత్తిదారులకు పూర్తిస్థాయిలో దక్కడం లేదని రైతులు అంటున్నారు.

**పశువైద్య సేవలు మెరుగుపడాలి**

పశువైద్యశాలల్లో వైద్యులు, సిబ్బంది కొరత కారణంగా అనేక ప్రాంతాల్లో రైతులకు సకాలంలో సేవలు అందడం లేదనే ఆందోళన ఉంది. నోటి–కాలి వ్యాధి, గాలిసోకు తదితర అంటువ్యాధుల నియంత్రణకు పటిష్టమైన చర్యలు అవసరం.దేశ వ్యాప్తంగా పశువులకు శతశాతం టీకాలు అందించడంతో పాటు కృత్రిమ గర్భధారణ సేవలను గ్రామీణ స్థాయిలో విస్తృతంగా అందుబాటులోకి తీసుకురావాలి.

**గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముక**

రాష్ట్రంలో సహకార డెయిరీల ద్వారా రోజుకు సుమారు 21.7 లక్షల లీటర్ల పాలు, ప్రైవేట్ డెయిరీల ద్వారా 47.5 లక్షల లీటర్ల పాలు సేకరించబడుతున్నట్లు అంచనా. అదనంగా అసంఘటిత రంగం ద్వారా సుమారు 220 లక్షల లీటర్ల వరకు పాలు విక్రయమవుతున్నట్లు పేర్కొంటున్నారు.ఇంతటి విస్తృతమైన పాడి రంగం గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా ఉన్నప్పటికీ, తగిన ప్రోత్సాహం లేక అభివృద్ధి ఆశించిన స్థాయిలో సాగడం లేదనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.ప్రత్యేక సహాయక చర్యలు అవసరంపాడి రైతులకు ప్రత్యేకంగా కనీసం రూ.20 వేల సబ్సిడీతో పాడిపశువుల కొనుగోలుకు సహాయం, పశు బీమాకు రూ.2 వేల ఆర్థిక సహాయం, సబ్సిడీపై నాణ్యమైన దాణా, పశుగ్రాస అభివృద్ధి కార్యక్రమాలు, ఉచిత పశువైద్య సేవలు, నాణ్యమైన పాలకు ప్రీమియం ధర వంటి చర్యలు అమలు చేయాల్సిన అవసరం ఉంది.లీటరు గేదె పాలకు కనీసం రూ.10, ఆవు పాలకు రూ.5 అదనపు ప్రోత్సాహక ధర చెల్లించే విధానాన్ని ప్రభుత్వం పరిశీలించాలని పాడి రైతులు కోరుతున్నారు.

**పాడి రైతు కుటుంబాలకు సామాజిక భద్రత**

పాడి రైతుల సంక్షేమానికి ప్రత్యేక పథకాలు రూపొందించాల్సిన అవసరం ఉంది. రైతు కుటుంబంలో వివాహానికి ఆర్థిక సహాయం, ప్రతిభ కనబరిచిన పిల్లలకు విద్యా ప్రోత్సాహకాలు, ఉన్నత విద్యలో ప్రవేశం పొందిన విద్యార్థులకు నగదు బహుమతులు, ఉత్తమ పాల ఉత్పత్తిదారులకు నగదు పురస్కారాలు, ప్రశంసాపత్రాలు అందించాలి.పాడి రైతు మరణించిన సందర్భంలో అంత్యక్రియల ఖర్చులకు ప్రత్యేక ఆర్థిక సహాయం అందించే విధానాన్ని కూడా ప్రభుత్వం పరిశీలించాలి.

**పెద్ద డెయిరీ ఫారాలకు రాయితీలు**

పెద్ద డెయిరీ ఫారాలకు గడ్డి కోత యంత్రాలు, పాల క్యాన్లు, విద్యుత్తు రాయితీలు, మినరల్ మిక్చర్, బీమా ప్రీమియంపై సబ్సిడీలు అందించాలి. సహకార డెయిరీల్లో ఖాళీగా ఉన్న పోస్టులను భర్తీ చేసి, ఉద్యోగులకు తగిన వేతన సవరణలు అమలు చేయాలి.పాడి రైతుల సంక్షేమం, ఆధునికీకరణ, మార్కెటింగ్ కోసం ప్రత్యేకంగా కనీసం రూ.20 కోట్ల నిధిని ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది.

**పాడి రైతులే శ్వేత విప్లవానికి పునాది**

దేశంలో శ్వేత విప్లవం విజయవంతం కావడానికి పాడి రైతులే పునాది వేశారు. అలాంటి రైతులను నిర్లక్ష్యం చేస్తే గ్రామీణ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.పాడి పరిశ్రమను కేవలం వ్యవసాయ అనుబంధ రంగంగా కాకుండా గ్రామీణ ఉపాధి, మహిళా సాధికారత, పోషకాహార భద్రతకు కీలకమైన ఆర్థిక రంగంగా గుర్తించి సమగ్ర విధానంతో ప్రోత్సహించాలి.

పాడి రైతులకు గిట్టుబాటు ధర, తక్కువ వ్యయంతో దాణా, మెరుగైన పశువైద్య సేవలు, బీమా రక్షణ, మార్కెటింగ్ సదుపాయాలు కల్పించినప్పుడే పాడి పరిశ్రమకు పునరుజ్జీవనం లభిస్తుంది. ప్రభుత్వం సమగ్ర చర్యలు చేపట్టినప్పుడే దేశంలో మరోసారి శ్వేత విప్లవానికి నాంది పలికే అవకాశం ఉంటుంది. అని డా. ముచ్చుకోట సురేష్ బాబు అన్నారు.

# ప్రాచీన గ్రంథాల యంత్రానువాదం సుసాధ్యమే

- ఆధునిక సాంకేతికతతో భాషాభివృద్ధికి కొత్త అవకాశాలు
- మాతృభాషలోనే పాఠ్యపుస్తకాలు ప్రచురించాలి
- అనువాద విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు ప్రభుత్వాలు కృషి చేయాలి

**శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు టౌన్– సూర్య వాస్తవం :**

వెంకటాచలం శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ప్రస్తుతం అభివృద్ధి చెందిన ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో ప్రాచీన గ్రంథాల యంత్రానువాదం కూడా సుసాధ్యమేనని హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం విశ్రాంత ఆచార్యులు గారపాటి ఉమా మహేశ్వరరావు అన్నారు. వెంకటాచలం మండలం సరస్వతి నగర్‌లోని ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రంలో "తెలుగులో అనువాద సంప్రదాయం -- విద్యానువర్తనం" అంశంపై నిర్వహించిన రెండు రోజుల సదస్సు, కార్యశాల మంగళవారం ముగిసింది. ముగింపు సమావేశంలో ఆచార్య గారపాటి ఉమా మహేశ్వరరావు, కేంద్రం సంచాలకులు ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ పాల్గొని మాట్లాడారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంతర్జాలంలో తెలుగు భాష వినియోగం పెరిగినప్పుడే భాష మరింత సుసంపన్నమవుతుందని పేర్కొన్నారు. అనువాద గ్రంథాలు సామాన్య ప్రజలకు సైతం సులభంగా అందు




బాటులోకి తీసుకురావాల్సిన అవసరం ఉందన్నారు. ప్రభుత్వాలు పాఠ్యపుస్తకాలను మాతృ భాషలోనే ప్రచురించేలా చర్యలు చేపట్టాలని కోరారు. అంతకు ముందు జరిగిన సమావేశంలో ఆచార్య దేవారెడ్డి విజయలక్ష్మి మాట్లాడుతూ భారతీయ సంస్కృతి, సంప్రదాయాలను పరిరక్షించేందుకు భారతీయ రాజులు, సంస్కర్తలు చేసిన కృషి, పోరాటా లను భావితరాలకు తెలియ జేయాలనే సంకల్పంతో కేంద్ర ప్రభుత్వం జాతీయ విద్యా విధానం--2020ను అమలు చేస్తోందని తెలిపారు.డాక్టర్ సంగన భట్ల నరసయ్య, డాక్టర్ బూసి వెంకటస్వామి, డాక్టర్ జంధ్యాల శరత్ బాబు, డాక్టర్ భమిడిపాటి గౌరీశంకర్, డాక్టర్ కప్పగంతుల రామకృష్ణ మాట్లాడుతూ ప్రపంచం ఒక కుగ్రామంగా మారిన నేపథ్యంలో అనువాదానికి ప్రాధాన్యత మరింత పెరిగిందన్నారు. మన జీవన విధానం, సంస్కృతి, సంప్రదాయాలు ఒక తరం నుంచి మరో తరానికి అనువర్తనం కావాలంటే అనువాద ప్రక్రియ కీలకమని పేర్కొన్నారు.అనువాద రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వాలు ప్రత్యే కంగా అనువాద విశ్వవిద్యాలయాల ఏర్పాటుకు కృషి చేయాలని వారు కోరారు. అనంతరం సదస్సులో పాల్గొన్న అధ్యాపకులు, పరి శోధకులకు ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్య క్రమంలో అధ్యాపకులు, పరిశోధకులు, విద్యార్థులు, ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం విద్యాత్మక, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యం

- వరుసగా రెండో రోజు ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజాదర్బార్
- జిల్లా నలుమూలల నుంచి భారీగా తరలివచ్చిన ప్రజలు, నాయకులు
- వినతులను స్వయంగా పరిశీలించి.. అధికారులకు తక్షణ ఆదేశాలు



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** ఆర్థిక మంత్రి క్యాంప్ కార్యాలయంలో రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ వరుసగా రెండో రోజు 'ప్రజాదర్బార్' కార్యక్రమాన్ని నిర్వహించారు. జిల్లా నలుమూలల నుంచి ప్రజలు, ప్రజాప్రతినిధులు, నాయకులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి తమ సమస్యలను మంత్రి దృష్టికి తీసుకువచ్చారు.ప్రజల నుంచి అందిన ప్రతి వినతిని మంత్రి పయ్యావుల కేశవ్ స్వయంగా పరిశీలించారు. సమస్యల వివరాలను అడిగి తెలుసుకుని, వాటి పరిష్కారానికి అవసరమైన చర్యలపై సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.ప్రజల సమస్యలను నేరుగా విని, పరిష్కారానికి తక్షణ చర్యలు చేపడుతూ మంత్రి పయ్యావుల కేశవ్ ప్రజలకు అండగా నిలుస్తున్నారని పలువురు అభిప్రాయపడ్డారు. ప్రజాదర్బార్ ద్వారా తమ సమస్యలను నేరుగా మంత్రికి వివరించే అవకాశం లభించడంతో ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారు.

## 24 గంటల్లో ఇద్దరు గురుకుల విద్యార్థుల ఆచూకీ లభ్యం

- 15 ప్రత్యేక పోలీసు బృందాలతో ముమ్మర గాలింపు..
- సురక్షితంగా తల్లిదండ్రులకు అప్పగింత
- కేసును ఛేదించిన పోలీసు బృందాలకు ఎస్పీ అభినందనలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం :** వజ్రకరూరు మండలం కొనకొండ్ల గ్రామంలోని పాఠశాలలో మిస్సింగ్ అయిన ఇద్దరు గురుకుల విద్యార్థుల ఆచూకీని అనంతపురం జిల్లా పోలీసులు కేవలం 24 గంటల్లోనే గుర్తించారు. విద్యార్థుల కోసం 15 ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేసి ముమ్మరంగా గాలింపు చేపట్టారు. గాలింపు చర్యల్లో భాగంగా ఉరవకొండ మండలం మోపిడి గ్రామంలో ఇద్దరు విద్యార్థులను పోలీసులు సురక్షితంగా గుర్తించారు. అనంతరం వారిని సిఐ మహానంది, ఎస్ఐ జనార్దన్ నాయుడు తల్లిదండ్రులకు అప్పగించారు. కేసును సత్వరం ఛేదించి, విద్యార్థులను సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించడంలో కీలకంగా పనిచేసిన పోలీసు బృందాలను జిల్లా ఎస్పీ పి. జగదీష్, అభినందించారు."విద్యార్థుల భద్రతే పోలీసుల ప్రధాన బాధ్యత. వారి ఆచూకీ కోసం అన్ని కోణాల్లో వేగవంతమైన చర్యలు చేపట్టాం" అని సిఐ మహానంది తెలిపారు.

## గజరాంపల్లిలో సుంకులపరమేశ్వరి బోనాల ఉత్సవం

**పామిడి - సూర్య వాస్తవం:** మండలంలోని గజరాంపల్లి గ్రామంలో వెలసిన సుంకులపరమేశ్వరి అమ్మవారికి ఆషాడ మాసం బోనాల ఉత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. చివరి మంగళవారం కావలముతో మూల విరాట్ అమ్మవారికి ఉదయం నుంచి పలురకాల అభిషేకాలు అర్చనలు పూజలు నిర్వహించారు. తదుపరి మహిళాభక్తాదులు బోనాలు, పూలగంపలు, గాజులు పసుపు కుంకుమ గంపలు, వడిబియ్యం గంపలలో తలపై ఉంచుకొని డప్పులు తప్పట్లు మేడ తాళాలతో చిందులు వేస్తూ అంగరంగ వైభవంగా గ్రామంలో ఊరేగింపుతో ఆలయానికి చేరుకున్నారు. ఈ



కార్యక్రమానంతట పూజారి సుధాకర్ ఆధ్వర్యంలో అత్యంత వైభవంగానిర్వహించారు. అనంతరం ఆలయంలో మహా మంగళహారతి కాయించి వచ్చిన భక్తులందరికీ తీర్థ ప్రసాదాల తో పాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

## వరుణ దేవుని కరుణ కోసం పూజలు

**గుత్తి - సూర్య వాస్తవం :**మండలంలోని లాచ్చినిపల్లి, పొలిమేరలో మంగ్లవారం పోలి మేర పెద్ద మ్మ గుడిలో వర్షం కోసం భక్తులు ప్ర త్యేక పూజలు చేశారు.ఈ సంద ర్భంగా ప్రక్కనే గంగమ్మ గుడిని ని ర్మించేందుకు గంగమ్మ విగ్రహం ఏర్ప టుకు ప్రత్యేక పూజలు చేశారు.7 సంవత్సరాల నుంచి వరుణ దేవుని కరుణ కోసం పూజలు చేసు_న్నట్లు కాలువ ఎద్దుల నాగభూషణం తెలి పారు.ఈ కార్యక్రమంలో చంద్రప్ప, బిందెల వెంకట రాముడు నంద్యాల గుర్రప్ప,చాకల సుధాకర్,చాకల బా లక్రిష్ణ,నిడ్జి రామాం జినేయులు, రవి, లక్ష్మినారాయణా, చిత్తనకట్ట లక్ష్మీనారాయు 90 ఉల్లికట్ల రమేష్ పాల్గొ న్నారు.



# రైతాంగానికి బాసటగా.. ప్రతి ప్రయత్నం చేస్తాం

- సూపర్ ఎల్‌నినో ప్రభావంపై క్షేత్రస్థాయి అధ్యయనం
- జిల్లాల వారీగా వ్యవసాయ శాస్త్రవేత్తల పర్యటన
- పంటల పరిస్థితులపై సమగ్ర నివేదిక కోరిన మంత్రి పయ్యావుల కేశవ్
- ప్రత్యామ్నాయ పంటలు, కార్యాచరణ ప్రణాళికలపై ప్రభుత్వ దృష్టి
- రైతాంగానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉంది



**అనంతపురం ప్రతినిధి - సూర్య వాస్తవం :** రైతాంగానికి అండగా నిలిచేందుకు ప్రభుత్వం అవసరమైన ప్రతి చర్య తీసుకుంటుందని రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తెలిపారు. అనంతపురం రామ్ నగర్‌లోని క్యాంప్ కార్యాలయంలో మంత్రి పయ్యావుల కేశవ్‌ను ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ పాలడుగు సత్యనారాయణ నేతృత్వంలోని వ్యవసాయ శాస్త్రవేత్తల బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. రాష్ట్రంలో సూపర్ ఎల్‌నినో ప్రభావంతో నెల కొంటున్న వాతావరణ పరిస్థితులు, వాటి కారణంగా పంటలపై పడుతున్న ప్రభావాన్ని అంచనా వేసేందుకు వ్యవసాయ శాస్త్రవేత్తల బృందాలు జిల్లాల వారీగా క్షేత్ర స్థాయిలో పర్యటిస్తున్నాయి. ఇందులో భాగంగా అనంతపురం జిల్లాలో పర్యటించిన శాస్త్రవేత్తలు జిల్లాలోని వర్షాభావ పరిస్థితులు, పంటల పరిస్థితులు, రైతులు ఎదుర్కొంటున్న సమస్యలను మంత్రికి వివరించారు.ఈ సందర్భంగా మంత్రి పయ్యావుల కేశవ్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు రాష్ట్రంలోని ప్రతి జిల్లాలో వ్యవసాయ పరిస్థితులను క్షేత్రస్థాయిలో పరిశీలించేందుకు ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్, వ్యవసాయ శాస్త్రవేత్తల బృందాలు వారం రోజులుగా పర్యటిస్తున్నాయని తెలిపారు.ప్రతి జిల్లాలోని ఆర్‌ఎస్‌కే పరిధిలో, ప్రతి గ్రామంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలిస్తూ సూపర్ ఎల్‌నినో ప్రభావంతో రైతులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు.
దేశవ్యాప్తంగా సూపర్ ఎల్‌నినో ప్రభావం తీవ్రంగా ఉన్న నేపథ్యంలో రాష్ట్రంలోని వర్షాభావ పరిస్థితులపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. ఏయే జిల్లాల్లో ఎంత మేర వర్షాభావ పరిస్థితులు నెలకొన్నాయి? వాటి ప్రభావం పంటలపై ఏ విధంగా ఉంది? అనే అంశాలపై సమగ్ర నివేదిక రూపొందిస్తున్నట్లు వెల్లడించారు. తీవ్ర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ పంటలను సూచించడంతో పాటు, రైతులకు అనుకూలమైన ప్రత్యామ్నాయ కార్యాచరణ ప్రణాళికలను సిద్ధం చేయడంపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. క్షేత్రస్థాయి పరిస్థితులపై ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం నుంచి సమగ్ర నివేదిక కోరినట్లు మంత్రి తెలిపారు. ఎల్‌నినో పరిస్థితులపై నివేదిక అందిన వెంటనే యుద్ధప్రాతిపదికన అవసరమైన చర్యలు చేపడతామని స్పష్టం చేశారు.

# కనేకల్లు రోడ్డు రైల్వే వంతెనకు త్వరలో మోక్షం!

- ప్రజా ప్రతినిధులకు కేంద్ర రైల్వే సహాయ మంత్రి సోమన్న హామీ



**రాయదుర్గం - సూర్య వాస్తవం :** పట్టణంలోని కనేకల్లు రహదారిపై గత ఏడేళ్లుగా అర్థాంతరంగా నిలిచిపోయిన రైల్వే వంతెన నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్నను జిల్లా ప్రజాప్రతినిధులు కోరారు. ఢిల్లీలోని రైల్ భవన్‌లో మంగళవారం మంత్రి కార్యాలయంలో ప్రభుత్వ విప్, రాయదుర్గం ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు, అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, హిందూపురం ఎంపీ బి. కె. పార్థసారధి కేంద్ర మంత్రిని కలిసి వినతిపత్రం సమర్పించారు. రాయదుర్గం పట్టణ పరిధిలోని కనేకల్లుబి అనంతపురం ప్రధాన రహదారులపై చేపట్టిన రైల్వే వంతెన నిర్మాణ పనులు గత ఏడేళ్లుగా నిలిచిపోయిన విషయాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. తాను మంత్రిగా ఉన్న సమయంలో రాయదుర్గం నుండి అనంతపురం, కనేకల్లు రెండు రైల్వే వంతెనల నిర్మాణ పనులను ప్రారంభించినట్లు ఎమ్మెల్యే కాలవ శ్రీనివాసులు గుర్తు చేశారు. అనంతరం వివిధ కారణాలతో పనులు నిలిచిపోవడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వివరించారు. అనంతపురం రహదారిపై నిర్మాణంలో ఉన్న రైల్వే వంతెన పనులను పూర్తి చేసేందుకు జాతీయ రహదారుల ప్రాధికార సంస్థ అంగీకరించి రూ.46 కోట్లు మంజూరు చేసిందని ప్రజాప్రతినిధులు తెలిపారు. అయితే కనేకల్లు రోడ్డులోని రైల్వే వంతెన నిర్మాణాన్ని రైల్వే శాఖ ఆధ్వర్యంలోనే పూర్తి చేయాల్సి ఉందని వివరించారు. ముఖ్యంగా బళ్లారి--చిక్‌జాజూరు రైల్వే మార్గం డబ్లింగ్ పనులకు కేంద్ర క్యాబినెట్ ఆమోదం తెలిపిన నేపథ్యంలో కనేకల్లు రహదారిపై ఉన్న రైల్వే వంతెన నిర్మాణానికి మరింత ప్రాధాన్యత ఏర్పడిందని వారు పేర్కొన్నారు. డబ్లింగ్ పనులు పూర్తయిన తర్వాత రాయదుర్గం--తుమకూరు రైల్వే మార్గంలో రైళ్ల రాకపోకలు, రద్దీ మరింత పెరిగే అవకాశం ఉన్నందున ఈ వంతెన నిర్మాణాన్ని త్వరగా పూర్తి చేయాల్సిన అవసరం ఉందని మంత్రికి వివరించారు.ప్రజాప్రతినిధుల విజ్ఞప్తిపై కేంద్ర రైల్వే శాఖ సహాయ మంత్రి సోమన్న సానుకూలంగా స్పందించారు. వెంటనే రైల్వే బోర్డు సభ్యులతో పాటు నిర్మాణ పనులను పర్యవేక్షిస్తున్న అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ వంతెన నిర్మాణాన్ని ప్రాధాన్యత కలిగిన ప్రాజెక్టుల జాబితాలో చేర్చి, పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. కేంద్ర మంత్రి సానుకూల స్పందనతో ఏడేళ్లుగా నిలిచిపోయిన కనేకల్లు రైల్వే వంతెన నిర్మాణ పనులకు త్వరలో కదలిక వచ్చే అవకాశం ఉందని ప్రజాప్రతినిధులు ఆశాభావం వ్యక్తం చేశారు. వంతెన పూర్తయితే రాయదుర్గం పట్టణ ప్రజల రాకపోకలకు మెరుగైన సౌకర్యం కలగడంతో పాటు, భవిష్యత్‌లో పెరగనున్న రైల్వే రద్దీకి అనుగుణంగా రహదారి రవాణాకు కూడా ఎంతో ప్రయోజనం చేకూరనుంది. కల్లూరు వద్ద వున్న రైల్వే అండర్ బ్రిడ్జి లో నిత్యం నీళ్లు నిలిచి ఉంటాయి దీనివల్ల రెండువైపులా రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు, వెంటనే చర్యలు చేపట్టాలని , అదేవిధంగా ఈ మధ్యన మంత్రికి తెలిపిన పలు సమస్యలతో పాటు కొండవీడు ఎక్స్‌ప్రెస్ రోజూ నడపాలని అనంతపురం ఎంపీ మంత్రిని కోరారు.

# అనారోగ్యంతో హోంగార్డు మృతి..

- పోలీసుశాఖ దాతృత్వం
- మృతుడి కుటుంబానికి అండగా ఉంటామని భరోసా
రూ.10 వేల ఆర్థిక సాయం అందించిన జిల్లా ఎస్పీ
మరో రూ.15 వేల సాయం చేసిన కళ్యాణదుర్గం సబ్‌డివిజన్ సిబ్బంది



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :** కంబదూరు మండల పోలీస్‌స్టేషన్‌లో హోంగార్డుగా విధులు నిర్వహిస్తున్న వెంకటేష్ అనారోగ్యంతో చికిత్స పొందుతూ మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన బళ్లారి ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ సోమవారం రాత్రి కన్నుమూశారు. అనంతరం మృతదేహాన్ని స్వగ్రామమైన రాళ్ల అనంతపురం గ్రామానికి తరలించారు.విషయం తెలుసుకున్న అనంతపురం జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ ప్రత్యేక చొరవ తీసుకుని మృతుడి కుటుంబానికి రూ.10,000 ఆర్థిక సహాయం అందించారు. కుటుంబ సభ్యులకు అండగా ఉంటామని, పోలీసుశాఖ తరఫున అవసరమైన సహాయ సహకా రాలు అందిస్తామని భరోసా కల్పించారు.కళ్యాణదుర్గం డీఎస్పీ పి. రవిబాబు, కళ్యాణ దుర్గం రూరల్ సీఐ సి. నీలకంటేశ్వర, హోంగార్డ్ ఇన్‌చార్జ్ ఆర్ఎస్ఐ జాఫర్, కంబదూరు ఎస్ఐ లోకేష్ కుమార్ స్వయంగా రాళ్ల అనంతపురం గ్రామానికి వెళ్లి మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులర్పించారు. మృతుడి ఆత్మకు శాంతి చేకూరాలని, కుటుంబ సభ్యులకు మనోధైర్యం కలగాలని ప్రార్థించారు.ఈ సందర్భంగా పోలీసుశాఖ తరఫున కుటుంబానికి అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తామని అధికారులు హామీ ఇచ్చారు. అదేవిధంగా కళ్యాణదుర్గం సబ్‌డివిజన్ పోలీసు సిబ్బంది, హోంగార్డులు కలిసి రూ.15,000 ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.వెంకటేష్ మృతి పట్ల పోలీసు సిబ్బంది, హోంగార్డులు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. మృతుడి కుటుంబానికి భగవంతుడు మనోధైర్యాన్ని ప్రసాదించాలని ఆకాంక్షించారు.



# తండ్రి ఏఎస్ఐ...

# కొడుకు అసిస్టెంట్ కమాండెంట్...!

- రెండో ప్రయత్నంలోనే యూపీఎస్సీ సీఏపీఎఫ్‌లో ఆల్ ఇండియా ర్యాంక్
- కుమారుడి విజయంతో తండ్రి సువర్ణ రాజుకు గర్వకారణం
- పోలీస్ కుటుంబంలో వెల్లివిరిసిన ఆనందం
- కుటుంబ సభ్యులు, పోలీస్ సహచరుల అభినందనలు
- పట్టుదల, క్రమశిక్షణతో ప్రతిష్టాత్మక ఉద్యోగం సాధించిన సందీప్ శాంత్



**అనంతపురం క్రైమ్- సూర్య వాస్తవం :** తండ్రి పోలీస్ శాఖలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తుండగా.. కుమారుడు యూపీఎస్సీ నిర్వహించే అత్యంత ప్రతిష్టాత్మకమైన సీఏపీఎఫ్ పరీక్షలో విజయం సాధించి అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికయ్యారు. పశ్చిమగోదావరి జిల్లా కాళ్ల మండలం కోపల్లె గ్రామానికి చెందిన సువర్ణ రాజు ప్రస్తుతం అనంతపురంలోని 14వ పటాలం ఏపీఎస్పీలో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన పెద్ద కుమారుడు సరెళ్ల సందీప్ శాంత్ తాజాగా యూపీఎస్సీ నిర్వహించిన సీఏపీఎఫ్ పరీక్షలో ఆల్ ఇండియా ర్యాంక్ సాధించి అసిస్టెంట్ కమాండెంట్ ఉద్యోగాన్ని దక్కించుకున్నారు.సందీప్ శాంత్ చిన్ననాటి నుంచే చదువుల్లో ప్రతిభ కనబరిచారు. నల్గొండలోని అరబిందో స్కూల్‌లో పదో తరగతిలో 10/10 జీపీఏ సాధించారు. భీమవరంలోని శ్రీచైతన్య కళాశాలలో ఇంటర్మీడియట్‌లోనూ 10/10 మార్కులు సాధించారు. అనంతరం కృష్ణా యూనివర్సిటీలో డిగ్రీ పూర్తి చేసి, ప్రస్తుతం ఢిల్లీ యూనివర్సిటీలో పోస్టుగ్రాడ్యుయేషన్ చదువుతున్నారు.యూపీఎస్సీ నిర్వహించే సీఏపీఎఫ్ పరీక్షలో ప్రిలిమ్స్, మెయిన్స్, ఫిజికల్ ఈవెంట్స్, ఇంటర్వ్యూ, మెడికల్ పరీక్ష వంటి పలు దశలను విజయవంతంగా పూర్తి చేసి ఈ ఘనత సాధించారు. రెండో ప్రయత్నంలోనే ఆల్ ఇండియా ర్యాంక్ సాధించడం విశేషం.సందీప్ శాంత్ సాధించిన విజయంతో కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో పాటు పోలీస్ శాఖకు చెందిన సహచరులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. పట్టుదల, క్రమశిక్షణతో చదివి అసిస్టెంట్ కమాండెంట్‌గా ఎంపికైన సందీప్ శాంత్‌కు పలువురు అభినందనలు తెలిపారు.

## ప్రభాకర్ చౌదరి ఆధ్వర్యంలో టీడీపీ ఇంటింటి ప్రచారం



**పామిడి - సూర్య వాస్తవం :** మండల కేంద్రమైన పామిడి పట్టణంలోని 8వ వార్డులో సోమవారం టిడిపి సీనియర్ నాయకుడు, గుత్తి మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్ కే.ప్రభాకరచౌదరి ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు రెండేళ్ల పాలనలో నిర్వహించిన అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాల గూర్చి ఇంటింటికి వెళ్లి వివరిస్తూ ప్రభుత్వం నుంచి తల్లి దీవన, రైతు భరోసా, నేతన్న నేస్తం, బియ్యం చెక్కర లాంటి లాంటి సంక్షేమాలన్నీ అందుతున్నాయా లేదా అని అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రజల యొక్క సమస్యలను అడిగి తెలుసుకున్నారు. మరిన్ని సేవలు సంక్షేమాలు ప్రభుత్వం నుంచి అందాలంటే కూటమి ప్రభుత్వానికి చేదోడుగా నిలవాలని, త్వరలో రానున్న స్థానిక ఎన్నికలలో అభ్యర్థులను భారీ మెజార్టీతో గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కె ప్రభాకరచౌదరి, వార్డు ఇన్చార్జ్ కె వెంకటేష్, పట్టణ ఉపాధ్యక్షుడు బాబావలి, మాజీ మైనారిటీ అధ్యక్షుడు హుస్సేన్ పీరా, గంప మల్లయ్య, తదితరులు పాల్గొన్నారు. ప్రజల నుండి వచ్చిన సమస్యలను మండల ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరిస్తా మని హామీ ఇచ్చారు.

## ఇంటింటికి ప్రచారంలో పాల్గొన్న టీడీపీ నాయకులు

**గుత్తి - సూర్య వాస్తవం:** గుత్తి గుంతకల్లు నియోజక వర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం సూచ నలతో గుత్తి మరియు పా మిడి మండలాల ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈ శ్వర్ ఆధ్వర్యంలో గుత్తి మం డలం బేతపల్లి గ్రామం నందు తెలుగుదేశం పార్టీ నా యకులు ఇంటింటా తిరిగి కూటమి ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి గురించి ప్రజలకు తెలియజేశారు అలాగే బేత పల్లి తెలుగుదేశం పార్టీ నాయకులు మాట్లాడుతూ పెన్షన్ల పెంపు అవ్వాతాతలు వికలాంగులు విధవలకు నెలకు ఇచ్చే సామాజిక పింఛన్లను గణనీయంగా పెంచి ప్రతి నెల 1వ తేదీనే డోర్ డెలివరీ చేస్తున్నాం. ఉచిత గ్యాస్ సి లిండర్లు దీపం పథకం అం దిస్తున్నాం తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో బేతపల్లి స్టోర్ డీలర్ నాగరాజు,గుంతకల్లు నియోజకవ ర్గం ఐటీడీపి అధ్యక్షుడు సూ రి యాదవ్, బేతపల్లి ఫీల్డ్ అ సిస్టెంట్ మసీమూతి చిన్న రంగప్ప,బేతపల్లి తెలుగుదే శం పార్టీ యువ నాయకులు కదుముకుంట్ల ప్రతాప్ నాయుడు, జక్కల చెరువు రామాంజనేయులు, లాలూ శేఖర్, చాకలి మహేష్, తెలుగుదేశం పార్టీ నా యకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# క్రీడా ప్రతిభకు ప్రభుత్వం అండగా నిలుస్తోంది

- శింగనమల నియోజకవర్గ స్థాయి అనంత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ
- జిల్లా స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులకు అభినందనలు
- క్రీడాకారుల విజయాల్లో తల్లిదండ్రుల పాత్ర కీలకం: ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ
- ఉత్సాహభరితంగా పాల్గొన్న 800 మంది విద్యార్థుల
- విజేతలకు బహుమతులు, స్పోర్ట్స్ మెటీరియల్ కిట్ల పంపిణీ



**శింగనమల - సూర్య వాస్తవం:** శింగనమల మండలం పెరవలి గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన అనంత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్--2026 అండర్-14 శింగనమల నియోజకవర్గ స్థాయి క్రీడా పోటీల కార్యక్రమానికి ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.గత రెండు రోజులుగా నిర్వహించిన ఈ క్రీడా పోటీల్లో కోకో, కబడ్డీ, వాలీబాల్, ఫుట్‌బాల్, హాకీ, బాస్కెట్‌బాల్, జూడోతో పాటు లాంగ్‌జంప్, హైజంప్ వంటి అథ్లెటిక్స్ విభాగాల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి సుమారు 800 మంది విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ మాట్లాడుతూ.. ఇంత పెద్ద సంఖ్యలో విద్యార్థులు ఉత్సాహంగా క్రీడల్లో పాల్గొనడం మన ప్రాంతంలో క్రీడలపై ఉన్న ఆసక్తికి నిదర్శనమన్నారు. క్రీడల్లో ప్రతిభ కనబరిచే విద్యార్థులను ప్రోత్సహించేందుకు ప్రభుత్వం ప్రత్యేకంగా దృష్టి సారిస్తోందని తెలిపారు. పోటీల్లో విజయం సాధించిన క్రీడాకారులకు ఎమ్మెల్యే బహుమతులు అందజేసి, స్పోర్ట్స్ మెటీరియల్ కిట్లను పంపిణీ చేశారు. నియోజకవర్గ స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు తదుపరి జిల్లా స్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకుంటున్న విద్యార్థుల్లో క్రీడా ప్రతిభను వెలికితీసి, జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించేలా ప్రోత్సహించేందుకు కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే పేర్కొన్నారు. విద్యార్థులకు అవసరమైన ప్రోత్సాహం, సహకారం అందించేందుకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని అన్నారు.

విద్యార్థుల్లో క్రీడా స్ఫూర్తిని పెంపొందిస్తున్న ఉపాధ్యాయులకు, ముఖ్యంగా క్రీడాకారుల తల్లిదండ్రులకు ఎమ్మెల్యే ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. అనంత స్పోర్ట్స్ ఛాంపియన్‌షిప్‌లో పాల్గొన్న ప్రతి క్రీడాకారుడికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు.

# దళితులు ఎదుర్కొంటున్న సమస్యలకు పరిష్కారం ఉందా లేదా?

**దళితులపై కులవివక్షత చూపుతున్న గ్రామాలపై చర్యలు తీసుకోవాలి**



**పామిడి - సూర్య వాస్తవం :** పామిడి మండలంలో అన్ని గ్రామాలలో దళితులు వివిధ రూపాలలో వివక్షతను ఎదుర్కొంటున్నారని సిపిఎం పార్టీ అనుబంధ సంఘమైన కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) ఆధ్వర్యంలో మంగళవారం మండల రెవిన్యూ శాఖ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి ఎమ్మార్వో కి వినతి పత్రం అందజేశారు .ఈ సందర్భంగా సిపిఎం పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఓ.నల్లప్ప, సిపిఎం పార్టీ గుంటకల్ నియోజకవర్గం ఇంచార్జ్ డి శ్రీనివాసులు, సీనియర్ నాయకుడు అనిమిరెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి మల్లేష్ మాట్లాడుతూ కట్టకిందపల్లిలో దళితవాడ మిట్ట మీద ఉన్నందున కుళాయిలకు నీరు ఎక్కడంలేదని, త్రాగునీరు కోసం ఇతర కొళాయిల దగ్గరకు వెళితే వారి బిందెనీరు నుంచి దళితుల బిందెల లోనికి పోస్తారని, అలాగే దళితులకు స్మశానవాటికకు గతంలో ఐదు ఎకరాలు ఉండేదని ప్రస్తుతం 30 సెంట్లు మాత్రమే ఉన్నదని,మిగతాదంతయూ ఆక్రమణకు గురైందని, ఇలాగే ఖాదరపేటలోని దళితవాడలో రహదారిని కబ్జా చేయడంతో తగ్గు ప్రాంతపు ఇళ్లలోనికి వర్షపు నీరు, డ్రైనేజీ నీరు చేరుతున్నాయని, అనంపల్లిలోని దళితవాడలో డ్రైనేజీలు వీధిలైట్లు కొళాయిలు లేవని, అలాగే జి కొట్టాలలో ఇదే పరిస్థితి ఉన్నదని, కూటమి ప్రభుత్వము ఏమో దళితులు మాప్రాణమని వారికి ప్రత్యేకంగా అన్ని విధాల సంక్షేమాలు సౌకర్యాలు సమకూర్చి అభివృద్ధి పథంలో నడిపిస్తామని గొప్పలు చెప్పుకుంటున్నదని ఆగ్రహం వ్యక్తపరిచారు.వారు పేర్కొన్నారు. వీటన్నిటిని మండల ఉన్నతాధికారులు రెండు వారాల లోపల పరిష్కరించాలని లేకుంటే ఆందోళన కార్యక్రమాలను చేపడతామని, హెచ్చరించారు.దళితులకు ఏమేమి సౌకర్యములు కల్పించారో,అభివృద్ధి కోసం ఆర్థిక వనరులు ఏమి కల్పించారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో దళితులపై కుల వివక్షత లేని సమాజాన్ని ఏర్పాటు చేస్తే చాలని, అగ్రవర్ణాల చేతిలో స్వాతంత్రం వచ్చి 79 ఏళ్లు అవుతున్న ఇప్పటికీ బలైపోతున్నామని, ప్రభుత్వాల అన్ని రంగాలలో దళితులకు అన్యాయం జరుగుతున్నదని వారు విరుచుకుపడ్డారు.

ఈ కార్యక్రమంలో డి.శ్రీనివాసులు, ఓ నల్లప్ప పి అనిమిరెడ్డి, ఎం మల్లేష్, సాయి కుమార్ ముత్యాలు,, ఎర్రి స్వామి, చాకు, లక్ష్మణకుమార్, నిర్మల, సుబ్బమ్మ, రాజ్యలక్ష్మి, సాలమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ వైద్యురాలు డాక్టర్ జయశ్రీ...!



- కణేకల్ సీహెచ్‌సీలో ట్యూబెక్టమీ ఆపరేషన్లు!
- డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో గైనకాలజీకి మంచి స్పందన
- స్కానింగ్ సహా పలు సేవలు అందుబాటులో
- కణేకల్ సీహెచ్‌సీ మహిళలకు భరోసా

**కణేకల్- సూర్య వాస్తవం:** కణేకల్ కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో గైనకాలజిస్టుగా డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో అందిస్తున్న వైద్య సేవలకు మహిళల నుంచి మంచి స్పందన లభిస్తోంది. మహిళల ఆరోగ్య సమస్యలు, గర్భిణుల వైద్య పరీక్షలు, ప్రసూతి సంబంధిత సమస్యలపై ఆమె అందిస్తున్న సేవలు స్థానికంగా ఎంతో ఉపయోగకరంగా మారుతున్నాయి. గతంలో మహిళలు చిన్నచిన్న ఆరోగ్య సమస్యలకు సైతం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సిన పరిస్థితి ఉండగా, ప్రస్తుతం కణేకల్ సీహెచ్‌సీలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను వినియోగించుకునేందుకు ఆసక్తి చూపు తున్నారని స్థానికులు చెబుతున్నారు.డాక్టర్ జయశ్రీ ఆధ్వర్యంలో గర్భిణులకు అవసరమైన వైద్య పరీక్షలు, మహిళల ఆరోగ్య సమస్యలకు చికిత్స, ప్రసూతి సంబంధిత సలహాలు, చిన్న చిన్న ఆపరేషన్ లు తదితర సేవలు అందుతున్నాయి. ప్రభుత్వ ఆసుపత్రిలో నాణ్యమైన వైద్య సేవలు అందుబాటులోకి రావడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు వైద్య ఖర్చుల భారం కొంత మేర తగ్గుతోందని పలువురు అభిప్రాయ పడుతున్నారు.

ప్రభుత్వ వైద్యంపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు వైద్యులు, సిబ్బంది అందిస్తున్న సేవలు కీలకంగా మారుతున్నాయి. ముఖ్యంగా మహిళలకు సంబంధించిన సమస్యలను సకాలంలో గుర్తించి తగిన వైద్య సలహాలు, చికిత్స అందించడం ద్వారా డాక్టర్ జయశ్రీ సేవలు ప్రశంసలు అందుకుంటున్నాయి. మహిళల ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇస్తూ.. ప్రభుత్వ ఆసుపత్రిలో అందుబాటులో ఉన్న వైద్య సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వైద్య వర్గాలు సూచిస్తున్నాయి.

### మహిళలకు అందుబాటులో స్కానింగ్ సేవలు

గర్భిణుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్యవేక్షించేందుకు అవసరమైన వైద్య పరీక్షలతో పాటు స్కానింగ్ సేవలు కూడా అందుబాటులో ఉండటం మహిళలకు మరింత ప్రయోజనకరంగా మారింది.

గతంలో ఇలాంటి సేవల కోసం ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించాల్సి వచ్చేదని, ప్రస్తుతం సీహెచ్‌సీలోనే వైద్య సేవలు అందుతుండటంతో సమయం, ఖర్చు ఆదా అవుతోందని పలువురు పేర్కొంటున్నారు.



# 'తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్'సేవలు ఉచితం

## - నరసరావుపేటలో ప్రారంభించిన మంత్రి సత్య కుమార్



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవించిన బాలింతలు, నవజాత శిశువులను సురక్షితంగా ఇళ్లకు చేర్చేందుకు వీలుగా అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానంతో రూపొందించిన" 102 తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్"వాహన సేవలను రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మంగళవారం నరసరావుపేటలో పచ్చజెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ,తొలి విడత కింద రాష్ట్రవ్యాప్తంగా 300 నూతన అంబులెన్స్‌లను కొత్త బ్రాండింగ్‌తో సిద్ధం చేశామని,మిగిలిన 200 వాహనాలను త్వరలోనే అందుబాటులోకి తెస్తామని వెల్లడించారు.ఇక్కడ ప్రదర్శించిన 50 వాహనాల్లో 11 అంబులెన్స్‌లను పల్నాడు జిల్లాకు కేటాయించగా, మిగిలిన 39 వాహనాలను ఇతర జిల్లాలకు తరలించారు.దేశంలోనే తొలిసారిగా తల్లీబిడ్డల భద్రతకు ప్రాధాన్యమిస్తూ ఈ వాహనాల్లో ఎయిర్‌బ్యాగులు, సీట్‌బెల్టులు, ఫుట్‌రెస్టులు,జీపీఎస్ ట్రాకింగ్,మొబైల్ ఛార్జింగ్,అత్యవసర ఎస్ఓఎస్ (ఎస్ఓఎస్) బటన్‌లతో పాటు ఆరోగ్య సూచనలు అందించే ఆడియో వ్యవస్థను సమకూర్చినట్లు మంత్రి గారు వివరించారు.ప్రభుత్వ ఆసుపత్రుల నుంచి ఇంటికి చేర్చే డ్రాప్‌బ్యాక్ సేవలు పూర్తిగా ఉచితమని, తల్లితో పాటు ఇద్దరు సహాయకులు ప్రయాణించవచ్చని స్పష్టం చేశారు.ఇన్ఫెక్షన్లు వ్యాపించకుండా ముందుజాగ్రత్తగా ఒక్కో వాహనంలో ఒక బాలింత,ఆమె బిడ్డ,ఇద్దరు సహాయకులకు మాత్రమే అనుమతి ఉంటుందన్నారు. అంతేకాకుండా,తీవ్ర రక్తహీనతతో బాధపడే గర్భిణులకు,అధిక ప్రమాద స్థితిలో ఉన్న (హైరిస్క్) గర్భిణులకు ప్రత్యేకంగా పికప్,డ్రాప్‌బ్యాక్ సేవలు అందిస్తామని ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ తెలిపారు.

# ఆవులను అక్రమ రవాణా చేస్తే కఠిన చర్యలు

## - డీఎస్పీ చెంచు బాబు



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** పశువుల సంత నిర్వహించి అక్కడనుండి ఆవులను అక్రమ రవాణా చేస్తే వారిపై కఠిన చర్యలు చేపట్టడం జరుగుతుందని నాయుడుపేట పోలీస్ డివిజన్ డీఎస్పీ చెంచు బాబు నిర్వాహకులను హెచ్చరించారు. బుధవారం డి.ఎస్.పి, స్థానిక ఎస్సై జీవి నాయుడు జాతీయ రహదారి సమీపం లోని కుప్పారెడ్డి పాలెం గ్రామ ప్రాంతంలో ఇటీవల ఈ ప్రాంతంలో పలు రాష్ట్రాల నుండి భారీ వాహనాల్లో పశువులను దిగుమతి చేసుకొని సంత ఏర్పాటు చేస్తున్నట్లు ఆయనకు సమాచారం చేరడంతో ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ ప్రాంతంలో సంత నిర్వ హించడం, ఆవులను అక్రమ రవాణా చేయడం వంటివి చేస్తున్నట్లు తెలిస్తే తగిన చర్యలు తప్పవని ఘాటుగా హెచ్చరించారు. నిబంధనలకు విరుద్ధంగా సంత ఏర్పాటు చేయడం తగదని నిర్వా హకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో డి.ఎస్.పి చెంచుబాబు, ఎస్సై జివి నాయుడు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# పంట పొలాలను పరిశీలించిన వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తలు

**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** సూళ్లూరుపేట వ్యవసాయ సబ్ డివిజన్ లోని తడ సూళ్లూరుపేట, దొరవారిసత్రం మండలాల్లో ఎల్ నినో కంబాట్ టీం డిటి మురళీకృష్ణ ( ప్రధాన శాస్త్రవేత్త ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానం, తిరుపతి)డికే పుల్లశీ రాజు (ప్రధాన శాస్త్రవేత్త)ఎస్.కె హసీనా భాను (శాస్త్రవేత్త వ్యవసాయ పరిశోధనా స్థానం పొదలకూరు)మండల వ్యవసాయ అధికారులు వ్యవసాయ విస్తరణ అధికారులు మంగళవారం పర్యటించారు.ఇందులో భాగం గా దొరవారిసత్రం మండలంలోని శ్రీధనమల్లి మరియు ముచ్చల గుంట గ్రామాలలో పర్యటించి రైతుల పొలాలను పరిశీలించి తగిన సూచనలు అందించారు. రాబోయే రోజులలో ఎల్ నినో పరిస్థితుల్లో రైతులు చేపట్టవలసిన పంటల సరళి పంట మార్పు తగిన యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించారు ప్రస్తుతం పొలంలో ఉన్న వరి పంట పూత దశ నుంచి కోత దశ వరకు ఉన్నది ఈ దశలో కంకి నల్లి నివారణకు స్పైరో మెసిఫెన్ ఒక మిల్లీ లీటరు మరియు ప్రోపికోనజోల్ ఒక మిల్లీ లీటరు కలిపి పిచికారీ చేయాలి.పొటాష్ వేయలేని పరిస్థితుల్లో 13:0:45 10 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి అని సూచించారు. పచ్చిరొట్ట విత్తనాలైన జీలుగ జనుము మరియు పిల్లి పెసర తో పాటు తొమ్మిది రకాల విత్తనాలు కలిపి పి ఎం డి ఎస్ కిట్లు వ్యవసాయ శాఖ మరి ప్రకృతి వ్యవసాయం వారి వద్ద అందుబాటులో ఉన్నాయని ఇవి రైతులు తప్పకుండా తమ పొలాల్లో వేసి భూమి సారాన్ని పెంపొం దించుకోవాల్సిందిగా సూచించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారులు రాబోవు రోజులలో ఎల్లినో తీవ్రతను దృష్టిలో పెట్టుకొని రైతు సోదరులు పంటలను సాగు చేసుకొనవలనని సూచించారు.




# శ్రీకాళహస్తి హత్య కేసును ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు

- అంతర్రాష్ట్ర నేరచరిత్ర కలిగిన నలుగురు నిందితుల అరెస్ట్.
- శ్రీకాళహస్తిలో సంచలనం రేకెత్తించిన హత్య కేసును సాంకేతిక ఆధారాలతో ఛేదించిన తిరుపతి జిల్లా పోలీసులు.
- తమిళనాడు రాష్ట్రానికి చెందిన ముగ్గురు, పుత్తూరుకు చెందిన ఒక నిందితుడు అరెస్ట్- వీరందరి పై తమిళనాడు రాష్ట్రంలో గతంలో పలు క్రిమినల్ కేసులు నమోదు జిల్లా ఎస్పీ ఎల్. సుబ్బరాయుడు






**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** హత్య ఘటన వివరాలను ఎస్పీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన పత్రికా సమావేశంలో జిల్లా ఎస్పీ శ్రీ ఎల్ సుబ్బరాయుడు ఐపిఎస్.వెల్లడించారు.02-08-2026 రాత్రి సుమారు 7:30 గంటల సమయంలో శ్రీకాళహస్తి పట్టణంలోని పిర్ గెస్ట్ హౌస్ సమీపంలోని స్వర్ణముఖి నది కట్టపై శ్రీకాళహస్తికి చెందిన మగలంపాటి శివకుమార్ ఏ శివను గుర్తుతెలియని వ్యక్తులు కత్తులతో తలపై,శరీరంపై దాడి చేసి హత్య చేసిన ఘటనపై శ్రీకాళహస్తి 1 టౌన్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు శ్రీకాళహస్తి వంటి ప్రముఖ పుణ్యక్షేత్రంలో జరిగిన ఈ ఘటనను అత్యంత ప్రాధాన్యతతో పరిగణించిన తిరుపతి లిజిల్లా ఎస్పీ శ్రీ ఎల్.సుబ్బరాయుడు.ఐపీఎస్. కేసును ప్రత్యేకంగా అదనపు ఎస్పీ (ఎల్ అండ్ ఓ) శ్రీ రవి మనోహరాచారి పర్యవేక్షణలో శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహామూర్తి ఆధ్వర్యంలో శ్రీకాళహస్తి 1 టౌన్, 2 టౌన్, రూరల్,బి.ఎన్. కండ్రిగ పోలీసు అధికారులతో ప్రత్యేక దర్యాప్తు బృందాలను ఏర్పాటు చేశారు.ప్రత్యేక దర్యాప్తు బృందాలు వివిధ సాం కేతిక ఆధారాలను సేకరించి, వాటిని విశ్లేషించి ముద్దాయిలు (1) వి.కార్తీక్, (2) వి.గోపీనాథ్ ఏ గుండు గోపి,(3) బి.శ్రీధర్ ఏ రెడ్డి అను వార్లు శ్రీకాళహస్తికి వచ్చి శివకుమార్ ను కత్తులతో నరికి చంపినట్లుగా,మరియు (4) ఎం.సూర్య అను వ్యక్తి మరియు (5) తమిళనాడు రాష్ట్రంకు చెందిన మరొక ముద్దాయి (అబ్స్కాండింగ్) శివకుమార్ ను చంపడానికి అవసరమైన మోటార్ సైకిల్ మరియు కత్తులను సమకూర్చినట్లు దర్యాప్తులో తెలిసినది. పుత్తూరుకు చెందిన మునస్వామిసూర్య మరియు తమిళనాడు రాష్ట్రానికి చెందిన మరో నిందితుడు హత్యకు అవసరమైన కత్తులను, మోటార్ సైకిల్ ను సమకూర్చడంలో సహకరించినట్లు గుర్తించారు.

**"హత్యకు దారితీసిన పరిస్థితులు."**

తమిళనాడు పోలీసులకు కావలసిన నేరస్థుడు (మోస్ట్ వాంటెడ్ అక్యూస్డ్) తొప్పాయి గణేషన్ కు, చంపబడిన శివకుమార్ ఏ శివ శ్రీకాళహస్తి లో ఆశ్రయం కల్పించినాడని,ఆ తరువాత గణేశన్ 16.03.2026వ తేదీన చెన్నైలో పోలీస్ కాల్పులలో మరణించినాడని, అందుకు శివకుమార్ చెన్నై పోలీసు వారికి సమాచారం ఇచ్చినందు వల్లనే, తమిళనాడు పోలీస్ కాల్పులలో చనిపోయాడని అను మానంతో కక్ష పెంచుకొని,అరెస్టు కాబడిన ముద్దాయిలు ప్రతీకార చర్యగా శివకుమార ను హత్య చేయడం జరిగినది."అరెస్ట్ వివరాలు" దర్యాప్తులో లభించిన ఆధారాల మేరకు నలుగురు నిందితులను ఈ దినము అనగా 11.08.2026న అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి నేరానికి ఉపయోగించిన యమహా ఆర్15 మోటార్‌సైకిల్, రెండు కత్తులు,రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు.

**అరెస్టు చేసిన నిందితుల వివరాలు.**

1.వెంకటేషన్ కార్తీక్,వయస్సు 32 సంవత్సరాలు, తండ్రి: పెద్ద గోవిందు వెంకటేషన్,తాలవేడు గ్రామం, తిరుత్తణి తాలూకా,తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో 4 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

2. వేలు గోపీనాథ్ ఏ గుండు గోపి,వయస్సు 27 సంవత్సరాలు,తండ్రి: వేలు,పడి గ్రామం, అంబలత్తూరు తాలూకా,తిరువళ్లూరు జిల్లా, తమిళనాడు.ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో 25 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

3. బి.శ్రీధర్ ఏ రెడ్, వయస్సు 26 సంవత్సరాలు, తండ్రి: భాస్కర్,ఎడపాల్యం గ్రామం,ఆలమతి పోస్ట్, పొన్నేరి తాలూకా,తిరువళ్లూరు జిల్లా,తమిళనాడు. ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో 4 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు.

4. మునస్వామి సూర్య,వయస్సు 19 సంవత్సరాలు, తండ్రి: మునస్వామి,గాంధీనగర్,పుత్తూరు టౌన్, తిరుపతి జిల్లా,ఇతనిపై తమిళనాడు రాష్ట్రంలో 2 పాత కేసులు ఉన్నట్లు దర్యాప్తులో గుర్తించారు. ఈ కేసులో పరారీలో ఉన్న మరో నిందితుడిని అరెస్ట్ చేసేందుకు ప్రత్యేక పోలీసు బృందాలు గాలింపు చర్యలు కొనసాగిస్తున్నాయి. ఈ సంచలనాత్మక హత్య కేసును సాంకేతిక ఆధారాలను సమర్థవంతంగా వినియోగిస్తూ వేగంగా ఛేదించి నిందితులను అరెస్ట్ చేయడంలో ప్రతిభ కనబరిచిన అదనపు ఎస్పీ (ఎల్ అండ్ ఓ) రవి మనోహరాచారి, శ్రీకాళహస్తి డీఎస్పీ కె. నరసింహామూర్తి, వారి సబ్ డివిజన్ సీఐలు ఎస్సైలు,మరియు వారి సిబ్బందిని జిల్లా ఎస్పీ అభినందించారు.పై అరెస్టు కాబడిన ముద్దాయిలపై పీడీ యాక్ట్ నమోదుకు చర్యలు చేపట్టడం జరుగుతుంది. నేరచరిత్ర కలిగిన వ్యక్తుల కదలికలపై నిరంతర నిఘా,సాంకేతిక ఆధారాల వినియోగంతో, దర్యాప్తు కొనసాగిస్తూ,ప్రజల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తామని జిల్లా పోలీసులు స్పష్టం చేశారు.

# శిథిలావస్థలో అంగన్వాడీ భవనం..

## - చిన్నారులకు పొంచి ఉన్న ప్రమాదం



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** ఆగస్టు 15 కు 80వ స్వాతంత్ర దిన వేడుకలను జరుపుకోబోతున్నా! నేటికీ చిన్నారుల అక్షరాభ్యాస కేంద్రాలైన అంగన్వాడి-ప్రీ ప్రైమరీ పాఠశాలలు శిథిలావస్థ భవనాలలోని చిన్నారులు ఆటపాటలు - అక్షరాభ్యాసం చేస్తూ ఆ చిన్నారులు శిథిలమైన భవనంలోని కొనసాగుతున్నారు. దొరవారిసత్రం మండల పరిధిలోని కారికాడు గ్రామంలో నడుస్తున్న అంగన్వాడీ కేంద్ర భవనం ఇందుకు ఆ గ్రామస్తులను భయాందో ళనకు గురిచేస్తుంది.భవన నిర్మాణం నాలుగు దశాబ్దాల పైబడి శిథిలావస్థకు చేరింది. కొన్నేళ్లుగా గోడలు బీటలు వారి,స్లాబ్ పెచ్చులు ఊ డిపడుతున్న అంగన్వాడీ కేంద్రాన్ని శిథిలమైన భవనంలో కొనసాగిస్తున్నారు.అభం,శుభం తెలియని అమాయక చిన్నారులు ప్రమాదం ఏ రూపంలో వస్తుందో తెలియక ఆటల పాటలు, కేరింతలతో కాలం గడుపుతున్నారు.గతంలో పాతబడిన భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేసి మరమ్మతులు చేశారు. ఈ భవన నిర్మాణం శిథిలావస్థలో ఉన్న దానికి ఐసిడిఎస్ అధికా రులు ఎందుకు మరమ్మతులు చేయలేకపోయారు. ఆయుష్ కాలం చెల్లిన నిర్మాణాలకు కొత్త భవన నిర్మాణం చేపట్టేందుకు ప్రభుత్వానికి సిఫారస్తు ఎందుకు చేయలేదో ఆలోచించాల్సిన విషయమే. ఇలాంటి భవన నిర్మాణంలోనే కేంద్రాన్ని నడుపుతూ, పిల్లలకు ప్రమాదం పొంచి ఉన్న సంగతి సిడిపిఓ, సూపర్వైజర్ ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవడం లేదని గ్రామ ప్రజల ప్రశ్నిస్తున్నారు.పొరపాటున కాలం కలిసి రాక,చిన్నారులపై స్లాబ్ పెచ్చులు ఊడి పడితే ప్రమా దంతో కూడిన గాయాల గురయ్యే అవకాశం ఉంది.సంబంధిత ఐసిడిఎస్ అధికారులు అంగన్వాడీ పిల్లలకు అపాయం,ప్రమాదాలు జరగక ముందే తగు జాగ్రత్తలు తీసుకొని, మరో ప్రాంతంలో ఏర్పాటు ఏర్పా టు చేసి రక్షణ కల్పించాల్సిన బాధ్యత ఆ శాఖ అధికారుల పైనే ఉంది.



# నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో మినరల్ వాటర్ ప్లాంట్ ప్రారంభించిన మంత్రి





**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** నరసరావుపేట ఏరియా ఆసుపత్రిలో రాష్ట్ర వైద్య, ఆరోగ్య అండ్ కుటుంబ సంక్షేమ శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ డయాలసిస్ యూనిట్, ఫిజియోథెరపీ యూనిట్, ఆర్ఓఆర్ మినరల్ వాటర్ ప్లాంట్,నూతన లేబర్ రూమ్‌లను ప్రారంభించారు.

ఈ సందర్భంగా ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లాడుతూ.ప్రభుత్వ ఆసుపత్రుల్లో వైద్య సేవలను బలోపేతం చేస్తున్న ఫలితంగా నరసరావుపేట ఏరియా హాస్పిటల్‌లో ఓపీ సేవలు 2023--24లో 2.50 లక్షల నుంచి 2025--26లో 2.72 లక్షలకు,ఐపీ సేవలు 23,000 నుంచి 26,000కు పెరిగినట్లు తెలిపారు.మేజర్ సర్జరీలు 3,248 నుంచి 4,321కు,ఎక్స్ రే సేవలు 14,000 నుంచి 15,450కు,ఈసీజీ సేవలు 5,832 నుంచి 6,900కు పెరగగా,ల్యాబొరేటరీ పరీక్షలు 4.96 లక్షల నుంచి 9.80 లక్షలకు దాదాపు రెట్టింపయ్యాయని వెల్లడించారు.పల్నాడు జిల్లాలో ఆరోగ్య మౌలిక వసతులను మరింత బలోపేతం చేస్తూ 37 గ్రామీణ ఆరోగ్య కేంద్రాలు,19 పబ్లిక్ బ్లాక్ హెల్త్ యూనిట్స్ , 7 కొత్త పీహెచ్స్,2 యూపీహెచ్స్ అభివృద్ధి చేస్తున్నట్లు తెలిపారు. నరసరావుపేటకు 75 పడకల క్రిటికల్ కేర్ బ్లాక్ మంజూరు చేసి నిర్మాణ పనులు కొనసాగుతున్నాయని పేర్కొన్నారు. స్టేమి కార్యక్రమం ద్వారా రాష్ట్రవ్యాప్తంగా సుమారు 6,200 మంది గుండెపోటు బాధితులకు ఒక్కొక్కరికి రూ.45,000 విలువైన తేనెక్టెప్లేజ్ ఇంజెక్షన్‌ను ఉచితంగా అందిస్తున్నామని తెలిపారు. నరసరావుపేటలోనే గత రెండేళ్లలో స్టేమి కార్యక్రమం ద్వారా 51 మంది ప్రాణాలను కాపాడగలిగామని వెల్లడించారు.ప్రభుత్వ ఆసు పత్రుల్లో ఆధునిక మౌలిక వసతులు, వైద్య సిబ్బంది,అత్యవసర సేవలు,నాణ్యమైన వైద్య సేవలను మరింత బలోపేతం చేసి ప్రజలకు మెరుగైన ఆరోగ్య సేవలు అందించడంపై కూటమి ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారిస్తోందని మంత్రి సత్యకుమార్ యాదవ్ పేర్కొన్నారు.

# కుడి భుజానికి సర్జరీ చేయించుకోనున్న జూనియర్ ఎన్టీఆర్

**హైదరాబాద్ కిమ్స్‌లో రేపు జరగనున్న సర్జరీ**
**హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో శస్త్రచికిత్స**
**గత నెలలో గాయపడటంతో వైద్యుల నిర్ణయం**
**తాత్కాలికంగా నిలిచిన 'డ్రాగన్' సినిమా షూటింగ్**



ప్రముఖ తెలుగు సినీ నటుడు జూనియర్ ఎన్టీఆర్‌కు బుధవారం భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. గత నెలలో తగిలిన గాయంపై వైద్యుల పర్యవేక్షణ అనంతరం, హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో ఈ శస్త్రచికిత్స నిర్వహించాలని నిర్ణయించినట్లు ఆయన బృందం ఒక ప్రకటనలో వెల్లడించింది. గత నెల జులై 27న ఓ కార్యక్రమంలో పాల్గొన్న సమయంలో ఎన్టీఆర్ భుజానికి గాయమైంది. ఆ సమయంలో డాక్టర్ జె. మధుసూదన్ రావు, డాక్టర్ ఆర్.ఎ. పురంచంద్ర తేజస్వి నేతృత్వంలోని వైద్య బృందం ఆయన్ను పరీక్షించి, గాయం నుంచి పూర్తిగా కోలుకోవడానికి ఆరు నుంచి ఎనిమిది వారాల పాటు విశ్రాంతి అవసరమని సూచించారు. అప్పట్లో అభిమానులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆయన ప్రతినిధులు ఒక ప్రకటనను విడుదల చేశారు. తాజాగా ఎన్టీఆర్ కార్యాలయం విడుదల చేసిన ప్రకటనలో, "వైద్యుల సూచన మేరకు ఎన్టీఆర్‌కు రేపు కిమ్స్ ఆసుపత్రిలో భుజానికి శస్త్రచికిత్స జరగనుంది. ఆయన త్వరగా కోలుకునేలా చూసేందుకు వైద్య బృందం అన్ని ఏర్పాట్లు చేస్తోంది. శస్త్రచికిత్స అనంతరం ఆయన ఆరోగ్య పరిస్థితిని వెల్లడిస్తాం. మీ మద్దతుకు ధన్యవాదాలు" అని పేర్కొన్నారు. ఈ గాయం కారణంగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో ఎన్టీఆర్ నటిస్తున్న 'డ్రాగన్' సినిమా షూటింగ్ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఎన్టీఆర్ త్వరగా కోలుకోవాలని అభిమానులు, సినీ ప్రముఖులు ఆకాంక్షిస్తున్నారు.

# ఉదయనిధి వ్యాఖ్యల దుమారం.. త్రిష వరుస పోస్టులు వైరల్!




తమిళనాడు రాజకీయాల్లో ప్రకంపనలు రేపిన ఉదయనిధి స్టాలిన్ వ్యాఖ్యల వివాదం నేపథ్యంలో నటి త్రిష ఇన్‌స్టాగ్రామ్‌లో చేసిన పోస్టులు వైరల్‌గా మారాయి. ఉదయనిధి వ్యాఖ్యలపై ఆమె నేరుగా స్పందించకపోయినా.. వరుస పోస్టులతో పరోక్షంగా ఆయనకు సమాధానం ఇచ్చారా? అనే చర్చ మొదలైంది. తన అమ్మమ్మ 98వ పుట్టినరోజు వేడుకలకు సంబంధించిన ఫొటోలను త్రిష ఇన్‌స్టాగ్రామ్ స్టోరీస్‌లో పంచుకుంది. వాటితో పాటు కొన్ని సందేశాలను కూడా షేర్ చేసింది. "ఈ వయసులోనూ డ్రామాలు చేయడం ఏంటి? నీ పని నువ్వు చూసుకో.. డబ్బు సంపాదించుకో.. ప్రశాంతంగా ఉండు" అంటూ ఉన్న పోస్ట్‌ను పంచుకుంది. దానికి కనుబొమ్మ పైకెత్తిన ఎమోజీని జత చేసింది. మరో సందేశంలో "మీరు చేసే ప్రతి పనీ తిరిగి మీ దగ్గరకే వస్తుంది. మంచిగా ఉండండి.. మంచే చేయండి" అని ఉంది. "ఇకపై మీకు అన్నీ సవ్యంగా జరిగే అధ్యాయం మొదలైంది" అనే మరో సందేశాన్ని కూడా ఆమె పంచుకుంది. "రిస్క్ తీసుకునేవారే గెలుస్తారు" వంటి సందేశాలు కూడా ఉన్నాయి. "ఒకప్పుడు కోరుకున్న జీవితంతో ఇప్పుడు ఉక్కిరిబిక్కిరవడం ఎంత గొప్ప అదృష్టం" అంటూ మరో పోస్ట్‌ను త్రిష షేర్ చేసింది. అయితే ఈ పోస్టులన్నీ ఉదయనిధిని ఉద్దేశించేనా? అన్న దానిపై ఆమె స్పష్టత ఇవ్వలేదు. ఇటీవల కావేరీ జలాల అంశంపై తంజావూరులో జరిగిన ఆందోళన కార్యక్రమంలో ఉదయనిధి ప్రసంగించారు. ఈ సందర్భంగా త్రిష పేరుతో నినాదాలు రావడంతో ఆయన చేసిన వ్యాఖ్య వివాదాస్పదమైంది. దీనిపై రాజకీయంగా తీవ్ర విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో త్రిష తాజా పోస్టులు చర్చనీయాంశంగా మారాయి.




# పండగ సీజన్‌కు సోనీ భారీ లైనప్: సమంత, రోహిత్, అజయ్ దేవగణ్‌లతో కొత్త షోలు

పండుగ సీజన్‌ను పురస్కరించుకుని సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా భారీ కంటెంట్ లైనప్‌ను వెల్లడించింది. నటి సమంత రుత్‌ప్రభు, టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ, బాలీవుడ్ స్టార్ అజయ్ దేవగణ్ వంటి ప్రముఖులతో కూడిన వైవిధ్యమైన కార్యక్రమాలను ప్రేక్షకుల ముందుకు తీసుకురానుంది. వినోదం, రియాలిటీ, క్రైమ్, ప్రాంతీయ భాషలు, క్రీడలు వంటి అన్ని విభాగాల్లో ప్రేక్షకులను అలరించేలా ఈ ప్రణాళికను రూపొందించింది. అమితాబ్ బచ్చన్ వ్యాఖ్యాతగా వ్యవహరిస్తున్న 'కౌన్ బనేగా కరోడ్‌పతి' 18వ సీజన్ ఇప్పటికే సోనీ ఎంటర్‌టైన్‌మెంట్ టెలివిజన్, సోనీ లివ్‌లో ప్రారంభమైంది. ఇక టీమిండియా కెప్టెన్ రోహిత్ శర్మ ఒక ప్రత్యేక షో ద్వారా తొలిసారిగా బుల్లితెరపై అరంగేట్రం చేయబోతున్నాడు. మరోవైపు, ప్రముఖ నటుడు అజయ్ దేవగణ్ 'క్రైమ్ పెట్రోల్ 2026' అనే ట్రూ-క్రైమ్ సిరీస్‌కు వ్యాఖ్యాతగా వ్యవహరించనున్నాడు. ప్రాంతీయ ప్రేక్షకులను ఆకట్టుకునేలా సోనీ పలు కార్యక్రమాలను ప్రకటించింది. సోనీ లివ్‌లో ప్రసారమయ్యే 'మాస్టర్‌చెఫ్ తమిళ్' వంటల రియాలిటీ షోకు సమంత రుత్‌ప్రభు వ్యాఖ్యాతగా వ్యవహరించనుండగా, 'తమిళ్ ఐడల్' సింగింగ్ షోలో ఆస్కార్ విజేత ఏ.ఆర్. రెహమాన్ కీలక పాత్ర పోషించనున్నారు. మరాఠీ వెర్షన్ 'కోన్ హోనార్ కరోడ్‌పతి' కార్యక్రమానికి మాధురి దీక్షిత్ సారథ్యం వహించనున్నారు. వీటితో పాటు హన్సల్ మెహతా దర్శకత్వంలో ప్రతిష్ఠాత్మక 'స్కామ్ 2010' సిరీస్ కూడా సిద్ధమవుతోంది. సోనీ స్పోర్ట్స్ నెట్‌వర్క్ రాబోయే మూడు నెలల పాటు క్రీడాభిమానులకు నాన్‌స్టాప్ వినోదాన్ని అందించనుంది. శ్రీలంక, న్యూజిలాండ్‌లలో భారత పర్యటనలు, మహిళల టీ20 ఆసియా కప్, ఆసియా క్రీడల ప్రత్యక్ష ప్రసారాలతో క్రీడా లోకంలో సందడి చేయనుంది.



# శ్రీలంకకు షాకిచ్చేందుకు గిల్-గంభీర్ మాస్టర్‌ప్లాన్.. ప్రాక్టీస్‌లోనే ప్రణాళికలు అమలు!



శ్రీలంకతో టెస్టు సిరీస్‌కు సిద్ధమవుతున్న భారత జట్టు.. స్పిన్‌తో పాటు పేసర్ల నుంచి ఎదురయ్యే ముప్పుపైనా ప్రత్యేక దృష్టి పెట్టింది. ఆగస్టు 15 నుంచి రెండు టెస్టుల సిరీస్ ప్రారంభం కానున్న నేపథ్యంలో కెప్టెన్ శుభ్‌మన్ గిల్, కోచ్ గౌతమ్ గంభీర్ నేతృత్వంలోని టీమ్ మేనేజ్‌మెంట్ కీలక నిర్ణయం తీసుకుంది. మ్యాచ్‌లో ఎదురయ్యే పరిస్థితులకు తగ్గట్టుగా ప్రాక్టీస్ చేయాలని భావించింది. ఎన్‌సీసీ మైదానంలో ప్రాక్టీస్ కోసం ఉపయోగించిన పిచ్‌ను.. శ్రీలంక 'ఎలెవన్'తో జరిగిన వార్మప్ మ్యాచ్ పిచ్ తరహాలో సిద్ధం చేయాలని గ్రౌండ్ సిబ్బందికి సూచించింది. పిచ్‌పై పగుళ్లు వచ్చేలా చేసి.. నాలుగో రోజు వికెట్‌ను పోలిన పరిస్థితులు కల్పించారు. బంతి రివర్స్ స్వింగ్ అయ్యే అవకాశాలను దృష్టిలో పెట్టుకుని భారత బ్యాటర్లు ఫుట్‌వర్క్‌పై ప్రత్యేకంగా సాధన చేశారు. నెట్ సెషన్‌లో గిల్ ముగ్గురు త్రో-డౌన్ నిపుణుల నుంచి బంతులు ఎదుర్కొన్నాడు. పాత, కొత్త కూకాబుర్రా బంతులతో రివర్స్ స్వింగ్‌ను ఎదుర్కొనేలా సాధన చేశాడు. అనంతరం అకీబ్ నబీ నుంచి సెమీ-ఓల్డ్ బంతులతో బౌలింగ్ చేయించుకుని మరింత ప్రాక్టీస్ చేశాడు. గాలె పిచ్ సాధారణంగా స్పిన్నర్లకు అనుకూలంగా ఉంటుందని భావిస్తున్నారు. అయితే శ్రీలంక మైదానాల్లో బంతి త్వరగా పాతబడుతుందని.. దీంతో రివర్స్ స్వింగ్ కీలకంగా మారొచ్చని టీమ్ మేనేజ్‌మెంట్ అంచనా వేసింది. భారత్ ఇప్పటికే శ్రీలంక 'ఎలెవన్'పై మూడు రోజుల వార్మప్ మ్యాచ్ ఆడింది. శ్రీలంక మాత్రం ఎలాంటి ప్రాక్టీస్ మ్యాచ్ ఆడకుండానే సిరీస్‌లోకి దిగుతోందని మాజీ పేసర్ ఫర్వీజ్ మహరూఫ్ తెలిపారు. భారత బ్యాటింగ్‌పై సందేహాలు ఉన్నా.. సిరీస్‌కు ఆతిథ్య జట్టు కంటే భారత్ మెరుగ్గా సిద్ధమైందని ఆయన అభిప్రాయపడ్డారు.

# ఒలింపిక్స్ లక్ష్యంగా జీవీ రాజా స్టేడియం.. రూ.100 కోట్లతో భారీ మేకోవర్!



కేరళ రాజధాని తిరువనంతపురంలోని చారిత్రక జీవీ రాజా స్టేడియం రూపురేఖలు మారనున్నాయి. ఈ స్టేడియంను ఒలింపిక్ పోటీల నిర్వహణకు అనువుగా, అంతర్జాతీయ ప్రమాణాలతో అభివృద్ధి చేసేందుకు కేంద్ర పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ చొరవ తీసుకున్నారు. ఇందుకు రూ.100 కోట్లతో భారీ ప్రణాళికను సిద్ధం చేస్తుండగా, ఈ మేరకు కేరళ యూనివర్సిటీ ఉన్నతాధికారులతో ఆయన చర్చలు జరిపారు. సురేశ్ గోపీ ఇటీవల కేరళ యూనివర్సిటీ వైస్-ఛాన్సలర్ డాక్టర్ మోహనన్ కున్నుమ్మల్, యూనివర్సిటీ సిండికేట్ ఫైనాన్స్ సభ్యుడు ఆర్.ఎస్. శశికుమార్‌తో కలిసి స్టేడియంను సందర్శించారు. ఈ స్టేడియం యాజమాన్యం కేరళ యూనివర్సిటీ పరిధిలోనే ఉంది. ఈ ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం రూ.100 కోట్లు కేటాయించేందుకు సిద్ధంగా ఉందని సురేశ్ గోపీ తెలిపినట్లు శశికుమార్ వెల్లడించారు. త్వరలోనే యూనివర్సిటీ ఆధ్వర్యంలో ఒక మాస్టర్ ప్లాన్, డిటైల్డ్ ప్రాజెక్ట్ రిపోర్ట్ (డీపీఆర్) సిద్ధం చేయనున్నట్లు ఆయన తెలిపారు. సురేశ్ గోపీ సానుకూల దృక్పథంతో ఈ స్టేడియం ప్రపంచ స్థాయి క్రీడా కేంద్రంగా మారుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. 2036 సమ్మర్ ఒలింపిక్స్‌కు ఆతిథ్యమివ్వాలని భారత్ బలంగా ప్రయత్నిస్తున్న నేపథ్యంలో ఈ పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. ఒలింపిక్స్ కోసం అహ్మదాబాద్ నగరాన్ని ప్రధాన వేదికగా ప్రతిపాదించినప్పటికీ, ఈ క్రీడల కోసం తిరువనంతపురంలోని ఈ స్టేడియంను కూడా ఒక ముఖ్యమైన అథ్లెటిక్స్ వేదికగా తీర్చిదిద్దే అవకాశం ఉంది.

గతంలో అంతర్జాతీయ వన్డే మ్యాచ్‌కు ఆతిథ్యమిచ్చిన ఈ స్టేడియం, కొన్నేళ్లుగా సరైన నిర్వహణ లేక శిథిలావస్థకు చేరింది. సింథటిక్ ట్రాక్, ఇతర సౌకర్యాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. 1937లో ట్రావెన్‌కోర్ యూనివర్సిటీలో భాగంగా నిర్మించిన ఈ స్టేడియం, దాదాపు తొమ్మిది దశాబ్దాల చరిత్రకు చేరువవుతోంది. కేరళ క్రీడారంగ పితామహుడిగా పేరుగాంచిన కల్నల్ గోదవర్మ రాజా (జీవీ రాజా) పేరును ఈ స్టేడియంకు పెట్టారు. ఆయన కేరళలో అథ్లెటిక్స్, క్రికెట్, ఫుట్‌బాల్‌ను ప్రాచుర్యంలోకి తీసుకురావడంలో కీలక పాత్ర పోషించారు.




# రిటైర్మెంట్ ప్రకటన తర్వాత బోరున విలపించా.. తొలి కాల్ సచిన్ నుంచే: రహానే

భారత టెస్టు క్రికెట్ జట్టులో నమ్మకమైన బ్యాటర్‌గా, ముఖ్యంగా విదేశీ పర్యటనల్లో స్వింగ్ బౌలింగ్‌ను సమర్థంగా ఎదుర్కొన్న ఆటగాడిగా పేరుగాంచిన అజింక్యా రహానే ఇటీవల తన కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 38 ఏళ్ల వయసులో అన్ని ఫార్మాట్ల నుంచి తప్పుకుంటున్నట్లు ప్రకటించిన వెంటనే, అతనికి వచ్చిన తొలి ఫోన్ కాల్ మాస్టర్ బ్లాస్టర్ సచిన్ టెండూల్కర్ నుంచే కావడం విశేషం. రహానే ఇంకా ఆడతాడని భావించానని, ఇంత త్వరగా రిటైర్ కావడంపై సచిన్ కొంత నిరాశ వ్యక్తం చేసినట్లు రహానే స్వయంగా వెల్లడించాడు. రిటైర్మెంట్ ప్రకటించాక తాను ఎదుర్కొన్న భావోద్వేగాలను, సహచరుల స్పందనను రహానే ఒక ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. "నేను రిటైర్మెంట్ వీడియో సోషల్ మీడియాలో పోస్ట్ చేసిన వెంటనే సచిన్ పాజీ నుంచి ఫోన్ వచ్చింది. నువ్వు ఇంకా ఆడతావని అనుకున్నానని ఆయన అన్నారు. దానికి నేను ఎలాంటి పశ్చాత్తాపం లేకుండా తప్పుకుంటున్నానని, అందుకే కెరీర్‌ను ఇంకా సాగదీయాలని అనుకోవడం లేదని చెప్పాను. ఇర్ఫాన్ పఠాన్ కూడా ఫోన్ చేశాడు. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ, బుమ్రా, పుజారా మెసేజ్‌లు చేశారు. అందరికీ నేను ఒకే విషయం చెప్పాను. నా సర్వస్వాన్ని ఆటకు ఇచ్చాను, అందుకే సంతృప్తితోనే వెళ్తున్నాను" అని రహానే వివరించాడు. రిటైర్మెంట్ వీడియో రికార్డ్ చేసిన తర్వాత తాను తీవ్ర భావోద్వేగానికి గురై కన్నీళ్లు పెట్టుకున్నానని రహానే తెలిపాడు. "వీడియో రికార్డ్ చేశాక చాలాసేపు ఏడ్చాను. ఇన్నేళ్లుగా ప్రాణంగా ప్రేమించిన ఆటను ఇకపై ఆడలేననే వాస్తవం నన్ను తీవ్రంగా కలిచివేసింది. ఆ ఆలోచనే రికార్డింగ్ అంతటా నన్ను వెంటాడింది" అని అన్నాడు. ఈ సందర్భంగా తన సహచర ఆటగాళ్లు ఛతేశ్వర్ పుజారా, విరాట్ కోహ్లీలతో తనకున్న బంధాన్ని రహానే గుర్తుచేసుకున్నాడు. "దేశవాళీ క్రికెట్‌లో పుజారాతో, భారత జట్టులో కోహ్లీతో ఎక్కువ సమయం గడిపాను. మా అందరి లక్ష్యం ఒక్కటే. 2015లో టెస్టుల్లో 6 లేదా 7వ ర్యాంక్‌లో ఉన్న భారత జట్టును అగ్రస్థానానికి చేర్చాలన్నదే మా ఉమ్మడి లక్ష్యం. ఛాంపియన్లుగా నిలవడానికి ముందు ఎన్నో కఠిన దశలను ఎదుర్కొన్నాం, అయినా ఆ ప్రయాణాన్ని ఆస్వాదించాం. ఒకరి నుంచి ఒకరు నేర్చుకుంటూ, ఆటను విశ్లేషించుకుంటూ బలమైన బంధాన్ని ఏర్పరుచుకున్నాం" అని రహానే తన కెరీర్‌ను గుర్తుచేసుకున్నాడు.

# మాదకద్రవ్యాల నియంత్రణకు కఠిన చర్యల అమలు

- పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక నిఘా.. విస్తృత అవగాహన కార్యక్రమాలు
- ఇన్‌ఛార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ
- గంజాయి అక్రమ రవాణాపై ఉక్కుపాదం..
- మాదకద్రవ్యాల నియంత్రణకు శాఖల సమన్వయం కీలకం
- పాఠశాలల పరిధిలో 100 మీటర్లలోపు పొగాకు విక్రయాలపై నిఘా.
- మాదకద్రవ్యాలకు సంబంధించి టోల్ ఫ్రీ నెం.1972 కు ఫోన్ చేయాలి
- జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి



**అన్నమయ్య బ్యూరో - సూర్య వాస్తవం:** జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు సమన్వయంతో కఠినంగా చర్యలు తీసుకోవాలని ఇన్చార్జి జిల్లా కలెక్టర్ శివ్ నారాయణ శర్మ సంబంధిత అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్లో.. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి తో కలసి జిల్లా స్థాయి మాదకద్రవ్యాల కమిటీతో సమీక్ష సమావేశాన్ని ఇన్చార్జి కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్చార్జి కలెక్టర్ మాట్లాడుతూ.. జిల్లాలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల అక్రమ రవాణా, విక్రయాలు, వినియోగాన్ని అరికట్టేందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. విద్యార్థులు, యువత మాదకద్రవ్యాలకు దూరంగా ఉండేలా పాఠశాలలు, కళాశాలల్లో ప్రత్యేక నిఘాతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని సూచించారు. మాదకద్రవ్యాల నియంత్రణలో భాగంగా 'ఆపరేషన్ వజ్ర' కింద తనిఖీలు ముమ్మరం చేయాలని, హాస్టళ్లలోనూ ప్రత్యేక పర్యవేక్షణ చేపట్టాలని తెలిపారు. పాఠశాలల పరిధిలో 100 మీటర్లలోపు పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని ఆదేశించారు. స్వయం సహాయక సంఘాలు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, విద్యాసంస్థల యాజమాన్యాల సహ కారంతో మాదకద్రవ్యాల దుష్ప్రభావాలపై అవగాహన కల్పించాలని సూచించారు. మాదకద్రవ్యాల వినియోగం లేదా విక్రయాలకు సంబంధించిన సమాచారం తెలిసిన వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పాఠశాలలకు 100 మీటర్ల పరిధిలో పొగాకు ఉత్పత్తుల విక్రయాలపై ఉన్న నిబంధనలను కచ్చితంగా అమలు చేయాలని సూచించారు. ప్రధానోపాధ్యాయులకు స్పష్టమైన బాధ్యతలు అప్పగించి, ఎక్కడైనా నిబంధనల ఉల్లంఘన జరిగినట్లు సమాచారం అందితే వెంటనే సంబంధిత అధికారులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ప్రతి 15 రోజులకు ఒకసారి ప్రధానోపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి పరిస్థితిని తెలుసుకోవాలని సూచించారు.



మాదకద్రవ్య రహిత సమాజ నిర్మాణం కోసం అన్ని శాఖలు, ప్రజలు సమష్టిగా బాధ్యతతో పనిచేయాలని ఇంచార్జి జిల్లా కలెక్టర్ శివ నారాయణ శర్మ పేర్కొన్నారు. జిల్లా ఎస్పీ ధీరజ్ కునుబిల్లి మాట్లాడుతూ.. జిల్లాలో మాదకద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ సంవత్సరం జనవరి 26 నుండి ఇప్పటివరకు మొత్తంగా 7 కేసులలో 206 కేజీల గంజాయి స్వాధీనం చేసుకున్నామన్నారు. 33 నిందితులను గుర్తించామని, అందులో26 మందిని అదుపులోకి తీసుకోవడం 15 అమ్మకందారులను, 5మంది వినియోగదారులను గుర్తించామన్నారు. జిల్లాలో గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు పాల్పడుతున్న నెట్‌వర్క్‌లపై పోలీసులు ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి పలు కేసులను ఛేదించారు. ఇతర ప్రాంతాల నుంచి గంజాయిని తీసుకువచ్చి యువత, విద్యార్థులను లక్ష్యంగా చేసుకుని విక్రయిస్తున్న వ్యక్తులపై దర్యాప్తు చేపట్టి, పలువురిని అరెస్టు చేసి గంజాయిని స్వాధీనం చేసుకోవడం జరిగిందని అన్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కఠిన చర్యలు తీసుకుంటున్నారు. అవసరమైన సందర్భాల్లో పీడీ చట్టం కింద కూడా చర్యలు చేపడుతున్నారు. విద్యాశాఖ, పోలీస్ శాఖ వారు సమన్వయంతో ఈగల్ క్లబ్స్ ద్వారా జిల్లాలో ప్రతినెల స్కూల్లో, కాలేజీలలో అవగాహన కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి గంజాయి అక్రమ రవాణా, విక్రయాలకు సంబంధించిన సమాచారాన్ని సేకరించేందుకు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన ప్రత్యేక వ్యవస్థ ద్వారా ఇప్పటికే పలు సమాచారాలను సేకరించి, వాటిని పరిశీలిస్తున్నారు. ప్రజలు, తల్లిదండ్రులు, విద్యార్థులు, విద్యాసంస్థల యాజమాన్యాలు మాదకద్రవ్యాలకు సంబంధించిన చిన్న సమాచారం తెలిసినా వెంటనే టోల్ ఫ్రీ నెం.1972 కు ఫోన్ చేసి అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు. పాఠశాలల్లో విద్యార్థులు గుట్కా, సిగరెట్లు, ఇతర పొగాకు ఉత్పత్తులు లేదా మత్తు పదార్థాలను వినియోగించకుండా విద్యాశాఖ ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఈ సమావేశంలో పీలేరు ఆర్డిఓ , డీఎస్పీ, డీఈవో, డిఎంహెచ్ఓ, ఐసిడిఎస్ అధికారులు, సాంఘిక సంక్షేమ అధికారి, మదనపల్లె ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి అడిషనల్ డి సి హెచ్ ఎస్, ప్రొబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అధికారులు,జిల్లా రవాణా శాఖ అధికారి, జిల్లాఅధికాలు, ఎస్హెచ్ఓలు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల ప్రాణాలకు ముప్పు ఉన్న

# సబ్‌స్టేషన్ నిర్మాణం వెంటనే ఆపేయాలి : ఇర్ఫాన్ బాషా

**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం:** శ్రీనివాసనగర్‌లో జనావాసాల మధ్య నిర్మిస్తున్న నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ పనులను ప్రొద్దుటూరు కాంగ్రెస్ అసెంబ్లీ ఇన్‌చార్జ్ ఇర్ఫాన్ బాషా మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా స్థానిక ప్రజలతో మాట్లాడి, సబ్‌స్టేషన్ నిర్మాణం వల్ల భవిష్యత్తులో ఎదురయ్యే ప్రమాదాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఇర్ఫాన్ బాషా మాట్లాడుతూ, స్థానిక ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా ప్రొద్దుటూరు ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి సబ్‌స్టేషన్ నిర్మాణ పనులను ముందుకు తీసుకెళ్లడం సరికాదని విమర్శించారు. ప్రజల భద్రత, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకున్న తర్వాతే అభివృద్ధి పనులు చేపట్టాలని, అధికార బలంతో ప్రజల అభ్యంతరాలను పక్కన పెట్టడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని అన్నారు. ఈ ప్రాంతంలో 10 నుంచి 15 అడుగుల వరకు మాత్రమే ఉన్న ఇరుకైన రహదారుల మధ్య హైటెన్షన్ విద్యుత్ లైన్లు, భారీ విద్యుత్ పరికరాలు ఏర్పాటు చేయడం ప్రజల భద్రతకు ముప్పుగా మారే అవకాశం ఉందన్నారు. అత్యవసర సమయంలో ఫైర్ ఇంజిన్లు, అంబులెన్సులు కూడా ఈ ప్రాంతంలోకి చేరుకోవడం కష్టమని తెలిపారు.

2016లో జరిగిన స్టార్ టింబర్ డిపో అగ్ని ప్రమాదాన్ని గుర్తు చేస్తూ, అప్పట్లో కడప జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజిన్లు రావాల్సి వచ్చిందని, పరిస్థితిని అదుపులోకి తీసుకురావడానికి సుమారు రెండు రోజులు పట్టిందని తెలిపారు. అలాంటి పరిస్థితి జనావాసాల మధ్య సబ్‌స్టేషన్ వద్ద ఏర్పడితే ప్రజల పరిస్థితి



ఏమిటని ప్రశ్నించారు. ఈ స్థలాన్ని గతంలో అమృత మహి ట్రస్ట్, బీసీ హాస్టల్, కూరగాయల మార్కెట్ తదితర అవసరాలకు వినియోగించేందుకు ప్రతిపాదనలు వచ్చిన విషయాన్ని ఇర్ఫాన్ బాషా గుర్తు చేశారు. 2004లో అప్పటి ముఖ్యమంత్రి డాక్టర్ వై.ఎస్. రాజశేఖరరెడ్డి అమృత మహి ట్రస్ట్‌కు సంబంధించిన ప్రతిపాదనను నిలిపివేశారని తెలిపారు. ప్రస్తుతం కూడా ప్రజల అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకోకుండా సబ్‌స్టేషన్ నిర్మాణాన్ని కొనసాగించడం సరికాదన్నారు. "కాంగ్రెస్ పార్టీ విద్యుత్ సబ్‌స్టేషన్ల నిర్మాణానికి వ్యతిరేకం కాదు. జనసాంద్రత తక్కువగా ఉన్న ప్రాంతంలో, అన్ని భద్రతా ప్రమాణాలు పాటిస్తూ నిర్మించాలి. ప్రజల ప్రాణాలను ప్రమాదంలోకి నెట్టే విధంగా జనావాసాల మధ్య నిర్మాణాన్ని మాత్రం అంగీకరించం" అని స్పష్టం చేశారు. రెవెన్యూ అధికారులు, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్, విద్యుత్ శాఖ అధికారులు స్థలానికి వచ్చి స్థానిక ప్రజలతో మాట్లాడి వారి సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. సబ్‌స్టేషన్ వల్ల ఎలాంటి ప్రమాదం లేదని అధికారులు భావిస్తే, ప్రజల సమక్షంలో సాంకేతిక వివరాలతో స్పష్టత ఇవ్వాలని కోరారు. "ఏదైనా ప్రమాదం జరిగి ప్రాణనష్టం సంభవిస్తే బాధ్యత ఎవరిది? ముందుగానే ప్రమాదాన్ని నివారించడం ప్రభుత్వ బాధ్యత. సబ్‌స్టేషన్ నిర్మాణ నిర్ణయాన్ని ప్రభుత్వం పునఃపరిశీలించి, అవసరమైతే సురక్షితమైన ప్రత్యామ్నాయ స్థలాన్ని ఎంపిక చేయాలి. నాపై వ్యక్తిగతంగా ఎన్ని విమర్శలు చేసినా పర్వాలేదు.. కానీ ప్రజలు తమ భద్రతపై అడుగుతున్న ప్రశ్నలకు సమాధానం చెప్పాలి. ఇది ఇర్ఫాన్ బాషా వ్యక్తిగత సమస్య కాదు.. ప్రజల భద్రతకు సంబంధించిన సమస్య" అని ఇర్ఫాన్ బాషా అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాసనగర్‌కు చెందిన పెద్ద సంఖ్యలో స్థానిక ప్రజలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## "డిస్టిలరీల వ్యాపారం గురించి మాట్లాడే వైసీపీ నాయకులకు డిఎస్సీ గురించి ఏం తెలుసు?"

### - జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళీ



**ప్రొద్దుటూరు- సూర్య వాస్తవం:** కూటమి ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలను చూసి ఓర్వలేక ప్రతిపక్ష నాయకులు డీఎస్సీ జరిగిన 7 నెలల తరువాత ఉద్యోగ నియామకాలపై లేనిపోని రాద్ధాంతం చేస్తున్నారని జనసేన పార్టీ నాయకుడు మాదాసు మురళీ తీవ్రంగా విమర్శించారు. మంగళ వారం నందిని క్లాత్ మార్కెట్ లో గల జనసేన పార్టీ కార్యాలయం లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే పరిపాలనను చూసి ఓర్వలేక, ఎప్పుడో జరిగిన ఉద్యోగ నియామకాలపై ఇప్పుడు కొత్తగా వివాదాలు సృష్టించడం కేవలం రాజకీయ దృష్టి మళ్లింపు ప్రయత్నమే. నిరుద్యోగ యువతకు ఉద్యోగాలపై నిజమైన చిత్తశుద్ధి ఉంటే, వాస్తవాలను ప్రజలకు వివరించాలి. అంతేకానీ లేని సమస్యలను సృష్టించి యువతను తప్పుదోవ పట్టించకూడదు అని మాదాసు మురళీ అన్నారు. వైఎస్సార్‌సీపీ నాయకులు చిదిరి అప్ప రాజు, జోగి రమేష్ తదితరులు చేసిన తప్పులను ప్రజలు మరిచిపోయేలా ఇప్పుడు డిఎస్సీ పేరుతో డైవర్షన్ రాజకీయాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. ప్రజలు అన్నీ గమనిస్తున్నారు. ఎవరు అభివృద్ధి కోసం పనిచేస్తున్నారు? ఎవరు ప్రజల దృష్టిని మళ్లించేందుకు రాజకీయాలు చేస్తున్నారు? అనే విషయాన్ని ప్రజలు స్పష్టంగా అర్థం చేసుకుంటున్నారు. నిరుద్యోగుల భవిష్యత్తుతో రాజకీయాలు చేయడం మానుకోవాలి" అని మాదాసు మురళీ హితవు పలికారు.

## కొలవలి, సోంపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం

- పసల్ భీమా ప్రీమియం చెల్లించుటకు 15 ఆఖరి తేదీ
- మొక్కజొన్న పంటలో కత్తెర పురుగు నివారణకు తగు చర్యలు చేపట్టాలి



**ముద్దనూరు - సూర్య వాస్తవం :** మండలంలోని కొలవలి, సోంపల్లె గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని మండల వ్యవసాయ అధికారి మారెడ్డి వెంకట క్రిష్ణారెడ్డి ఆధ్వర్యంలో జరిగింది.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సచివాలయంలో గ్రామ సభ ఏర్పాటు చేసి పంటల బీమా చేసుకొనుటకు ఈ నెల 15 వతేది చివరి అవకాశం అన్నారు. కావున పంట సాగు చేసిన ప్రతి రైతు పంటల భీమా కొరకు ప్రీమియం డబ్బులు చెల్లించాలి అన్నారు. ఎలినినో ప్రభావం పంటలపై పడకుండా తగు జాగ్రత్తలు పాటించాలి అన్నారు. వ్యవసాయ శాస్త్రవేత్తలు మరియు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలి అన్నారు. రైతులకు కావాల్సిన కంది విత్తనాలు, రాగి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని కావాల్సిన వారు రిజిస్ట్రేషన్ చేసుకుని తీసుకోవాలి అన్నారు. పంటలు సాగు చేసిన ప్రతి రైతు పంట నమోదు చేసుకోవాలి అన్నారు. అనంతరం గ్రామంలో సాగు చేసిన మొక్కజొన్న పంటను పరిశీలించి రైతులకు తగు సూచనలు సలహాలు చేశారు. కత్తెర పురుగు నివారణకు తగు చర్యలు సూచించారు. ఇమామేక్టిన్ బెంజేట్ 5%యస్ జి అనే మందును ఎకరానికి 80 గ్రాములు 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకుంటే మంచి ఫలితం ఉంటుంది అన్నారు. రైతులు ఇష్టానుసారంగా క్రిమిసంహారక మందులు వాడరాదు అని సూచించిన మేరకే సిపారస్ చేసిన మేరకే పిచికారీ చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ ఉద్యాన సహాయకురాలు సింధు, సచివాలయ సిబ్బంది ధరణి, సురేఖ, ఆయా గ్రామాల రైతు సోదరులు బి.వెంకట స్వామి,యమ్.శివ రామిరెడ్డి, తదితర రైతులు పాల్గొన్నారు.

## సకాలంలో వ్యక్తి ప్రాణాలు కాపాడిన సుండుపల్లి పోలీసులు



**అన్నమయ్య బ్యూరో- సూర్య వాస్తవం:** సుండుపల్లి మండలం చిన్న గొల్లపల్లి రాజయ్యగారిపల్లికి చెందిన మల్లికార్జున నాయుడు పాయిజన్ తీసుకొని నేను చనిపోతున్నాను అని సుండుపల్లి ఎస్సై మహేష్‌కి సమాచారమిచ్చి ఫోను స్విచ్ ఆఫ్ చేయగా ఎస్సై మహేష్ ఆదేశాల మేరకు లొకేషన్ ట్రేస్ చేసి సంఘటన స్థలానికి చేరుకొని మల్లికార్జున నాయుడుని సకాలంలో కాపాడి 108 వాహనంలో రాయచోటి ప్రభుత్వ ఆస్పత్రికి తరలించిన కానిస్టేబుల్ వెంకటేష్ నాయక్, హోంగార్డ్ రవి ను నాయక్, రాచయ్య గారి పల్లి గ్రామస్తులు.

## కామ్రేడ్ గంగిశెట్టి రిటైర్డ్ మాస్టర్ సంస్మరణ సమావేశం



**రాయచోటి-సూర్య వాస్తవం:** కామ్రేడ్ గింగిశెట్టి సంస్మరణ సభ మంగళవారం జిల్లా అధ్యక్షులు బి వెంకటరమణ అధ్యక్షతన నిర్వహించడమైనది. సమావేశమునకు ముఖ్యఅతిథిగా పిసి రెడ్డన్న జై చంద్రా రెడ్డి, వాకా రెడ్డి కుమార్, మైకు వారి తండ్రి జ్ఞాపకార్థం వితరణ చేసిన సంఘ నాయకురాలు గంగాదేవి, గుడిబండ శ్రీనివాసులు, ఈశ్వరయ్య, రామచంద్ర, రాజమోహన్ రాజు, చంగల్ రెడ్డి, ఎం వెంకటరమణ, రోశయ్య, కృష్ణమూర్తి. సమావేశం నందు గంగిశెట్టి విద్యాభ్యాసము మరియు ఉద్యోగ విషయము, క్రమశిక్షణ, కుటుంబ అభ్యున్నతికి తోడ్పడిన విషయము, సంఘములో నిర్వహించిన నాయకత్వము,మృదు స్వభావము మరియు నిబద్ధత, సేవా గుణము, నిరాడంబర జీవితము, బాధ్యత పట్ల అంకిత భావము. మొదలగు విషయంలను తెలియజేశారు .ఈ సందర్భంగా తండ్రి జ్ఞాపకార్థము సంఘమునకు మైకు వితరణ చేసినటువంటి గంగాదేవి గారికి ప్రతి ఒక్కరూ కృతజ్ఞత తెలపడం అయినది.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR, ANDHRA PRADESH - 517325. CELL : 9885404140 ( ASSOCIATE EDITOR - Mohammad Shafi Ahamad 9948461699 )

- పోరాటమే మార్గంగా ముందుకు సాగుతున్న నిత్య కృషివలుడు
- ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా నిరంతర కృషి
- అన్ని ఉద్యోగుల సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకత్వం
- కష్టకాలంలో ఉద్యోగులకు కొండంత అండగా దివాకర్ బాబు
- ఉద్యోగుల హక్కుల కోసం రాజీలేని పోరాటం
- వీఆర్ఏలు, వీఆర్వోల సమస్యలపై నిరంతర పోరాటం
- ఉద్యోగుల సాధకబాధకాల్లో కుటుంబ సభ్యుడిలా అండ
- సేవాభావం, నిబద్ధతతో ఉద్యోగుల మనసు గెలుచుకున్న నాయకుడు
- మనసున్న నాయకుడుకి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు

# ఉద్యోగుల సంక్షేమమే లక్ష్యం...

## సేవే శ్వాసగా దివాకర్ బాబు




**అనంతపురం రెవిన్యూ –సూర్య వాస్తవం :** ఏపీ జేఏసీ అమరావతి చైర్మన్, మన అనంతపురం జిల్లా ఏపీ ఆర్ఎస్ఏ (ఆంధ్రప్రదేశ్ రెవిన్యూ సర్వీస్ అసోసియేషన్) అధ్యక్షులు, రెవిన్యూ ఉద్యోగుల ఆత్మీయ నాయకులు దివాకర్ బాబుకి హృదయపూర్వక జన్మదిన శు భాకాంక్షలు. ఉద్యోగుల సమస్యలను తన సమస్యలుగా భావించి, వారి హక్కులు, సంక్షేమం కోసం నిరంతరం పోరాడుతూ... కష్టకాలంలో ఉద్యోగులకు కొండంత అండగా నిలిచే ఆపద్బాంధవుడు మీరు. జిల్లాలోని రెవిన్యూ ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల సాధకబాధకాల్లో ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ, ప్రతి ఉద్యోగిని తన కుటుంబ సభ్యుడిగా భావించి ఆప్యాయతతో పలకరించే మీ వ్యక్తిత్వం ఎంతో ప్రత్యేకమైనది. వీఆర్ఏలు, వీఆర్వోలు, రెవిన్యూ సిబ్బంది సహా ప్రతి ఉద్యోగి సమస్య పరిష్కారం కోసం ముందుండి గళం వినిపిస్తూ, అవసరమైన సందర్భాల్లో అధికారుల దృష్టికి సమస్యలను తీసుకెళ్లి న్యాయం జరిగే వరకు పోరాడే మీ నాయకత్వం ఉద్యోగుల్లో నమ్మకాన్ని నింపుతోంది. ఉద్యోగుల హక్కుల పరిరక్షణలో మీ పోరాట పటిమ...



ఉద్యోగుల సంక్షేమంలో మీ సేవాభావం... సహచర ఉద్యోగుల పట్ల మీ ఆప్యాయత... ప్రతి ఒక్కరికీ అండగా నిలిచే మీ ధైర్యం... మిమ్మల్ని ఒక నాయకుడిగా మాత్రమే కాకుండా, ఉద్యోగుల కుటుంబంలో ఒక ఆత్మీయ సభ్యుడిగా నిలబెట్టాయి. మీ నాయకత్వంలో ఉద్యోగుల సమస్యలకు మరింత పరిష్కారం లభించాలని, మీ సేవా ప్రస్థానం మరింత విజయవంతంగా కొనసాగాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాము. మీరు చేపట్టే ప్రతి కార్యక్రమం విజయవంతం కావాలని, ఉద్యోగుల హక్కులు మరియు సంక్షేమం కోసం మీరు చేస్తున్న కృషికి మరింత బలం చేకూరాలని ఆకాంక్షిస్తున్నాము.

ఆ భగవంతుడు మీకు ఆయు రారోగ్యాలు, సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, సుఖసంతోషాలు ప్రసాదించి... కుటుంబ సభ్యులతో కలకాలం సంతోషంగా జీవిస్తూ, మరెన్నో సంవత్సరాలు ఉద్యోగుల సేవలో కొనసాగేందుకు సంపూర్ణ ఆశీస్సులు అందించాలని కోరుకుంటున్నాము ఈ కార్యక్రమానికి ఏపీ పోలీస్ అసోసియేషన్ ఈసీ మెంబర్, అనంతపురం 14 వ బెటాలియన్ అధ్యక్షులు తలారి పెద్దయ్య, సోమరా రామకృష్ణ, ఏపీ జెఏసి అమరావతి ఆర్గనైజ్ సెక్రటరీ వెంకట శివప్రసాద్, అనంతపురం క్రైమ్ రిపోర్ట్ సులేమాన్, పుట్టినరోజు వేడుకలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసారు.

**మరోసారి దివాకర్ బాబుకి జన్మదిన శుభాకాంక్షలు!**
**మీ సేవా ప్రస్థానం చిరకాలం కొనసాగాలి...**
**మీ నాయకత్వం మరింత బలపడాలి...**
**ఉద్యోగుల గుండెల్లో మీ స్థానం మరింత ఉన్నతంగా నిలవాలి!**



# ప్రజల విశ్వాసమే నా బలం.. అభివృద్ధే నా లక్ష్యం

**- ఇంటింటా ప్రచారంలో కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలన విజయాలను వివరించిన ఎమ్మెల్యే విజయశ్రీ**
**- అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందేలా ప్రభుత్వం కృషి చేస్తోందని వెల్లడి**

**పెళ్లకూరు – సూర్య వాస్తవం :** తిరుపతి జిల్లా పెళ్లకూరు మండలం చెంబెడు గ్రామ ప్రజలతో మమేకమై వారి సమస్యలను తెలుసు కుంటూ, కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ పార్థసారథి వివరించారు. తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో చెంబెడు గ్రామంలో నిర్వహించిన ఇంటింటా ప్రచార కార్యక్రమంలో ఎమ్మెల్యే విజయశ్రీ పాల్గొని ప్రతి ఇంటికీ వెళ్లి ప్రజలను ఆప్యాయంగా పలకరించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించిన కరపత్రాలను ప్రజలకు అందజేస్తూ వాటి వివరాలను తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం ప్రజల సంక్షేమం, గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యం ఇస్తూ అనేక కార్యక్రమాలను అమలు చేస్తోందని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి కుటుంబానికి చేరేలా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా నెరవేర్చే దిశగా ప్రభుత్వం ముందుకు సాగుతోందని అన్నారు.



**ప్రజల సమస్యలే ప్రథమ ప్రాధాన్యం**

ఇంటింటా ప్రచారంలో భాగంగా గ్రామంలోని ప్రజల యోగక్షేమాలను ఎమ్మెల్యే విజయశ్రీ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. వృద్ధులు, మహిళలు, యువతతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. గ్రామంలో నెలకొన్న మౌలిక వసతుల సమస్యలు, తాగునీరు, రహదారులు, పారిశుద్ధ్యం తదితర అంశాలపై ప్రజల నుంచి అభిప్రాయాలను సేకరించారు. ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చిన సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని ఎమ్మెల్యే హామీ ఇచ్చారు. ప్రజలకు అందుబాటులో ఉండే ప్రజాప్రతినిధిగా ప్రతి సమస్యను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు.



**చెంబెడు అభివృద్ధికి ప్రత్యేక దృష్టి**

చెంబెడు గ్రామాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానని ఎమ్మెల్యే విజయశ్రీ తెలిపారు. గ్రామానికి అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్యత క్రమంలో చేపట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు. గ్రామ ప్రజల సహకారంతో చెంబెడు గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లేందుకు కట్టుబడి ఉన్నామని పేర్కొన్నారు. ప్రజలతో నేరుగా మమేకమై వారి సమస్యలను తెలుసుకోవడం ద్వారా ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాల అమలుపై మరింత అవగాహన కల్పించడంతో పాటు, క్షేత్రస్థాయిలో ప్రజలకు ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకునే అవకాశం కలుగుతుందని ఎమ్మెల్యే అన్నారు. ఈ కార్యక్రమంలో మండలాధ్యక్షుడు సంచి కృష్ణయ్య, చైతన్య కృష్ణారెడ్డి, రాకేష్ రెడ్డి, పేరం రమేష్ నాయుడు, లోకేష్ నాయుడు, మల్లి రెడ్డి, మస్తాన్ రెడ్డి, సిద్ధిల్ నాయుడు, శేఖర్ నాయుడు, చెంబెటి రమణయ్య రవి, పరశురాం తదితర తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# గ్రామీణ ప్రజల్లో అవగాహనే లక్ష్యం

**- జిల్లావ్యాప్తంగా 'వీధి కూడలి మీటింగ్స్'తో పోలీసుల విస్తృత ప్రచారం**
**- సైబర్ మోసాలు, రోడ్డు భద్రత, మహిళలు--పిల్లల రక్షణపై అవగాహన**
**- జూదం, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయికి దూరంగా ఉండాలని సూచన**




**అనంతపురం క్రైమ్ –సూర్య వాస్తవం :** గ్రామీణ ప్రజల్లో చట్టాలు, భద్రతా అంశాలపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా అనంతపురం జిల్లా పోలీసుల ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 'స్ట్రీట్ కార్నర్ మీటింగ్స్' నిర్వహిస్తున్నారు. జిల్లా ఎస్పీ పి. జగదీష్, ఆదేశాల మేరకు పలు గ్రామాల్లో పోలీసులు ప్రజలతో నేరుగా సమావేశమై వివిధ అంశాలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సైబర్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు సూచించారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపించే లింకులను క్లిక్ చేయవద్దని, బ్యాంకు ఖాతా వివరాలు, పాస్‌వర్డ్‌లు, ఓటీపీ లను ఎవరితోనూ పంచుకోవద్దని హెచ్చరించారు. రోడ్డు భద్రతపై కూడా ప్రజలకు అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని, వాహనాలను అతివేగంగా నడపవద్దని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించడం ద్వారా ప్రమాదాలను నివారించవచ్చని తెలిపారు. మహిళలు, చిన్నారుల భద్రతకు పోలీసులు అధిక ప్రాధాన్యత ఇస్తున్నారని పేర్కొన్నారు. మహిళలు 'శక్తి', 'స్త్రీ రక్ష' వంటి యాప్‌లను వినియోగించుకోవాలని, అత్యవసర పరిస్థితుల్లో 100 / 112కు సమాచారం అందించాలని సూచించారు. అలాగే ౹ూజుూ చట్టం, బాల్యవివాహాల నిరోధక చట్టంపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని వివరించారు. అదేవిధంగా జూదం, మట్కా, ఆన్‌లైన్ బెట్టింగ్, గంజాయి వంటి చట్టవ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని పోలీసులు హెచ్చరించారు. ముఖ్యంగా యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా తమ భవిష్యత్తుపై దృష్టి సారించాలని సూచించారు. గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు చేరువగా వెళ్లి అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం ద్వారా నేరాల నియంత్రణతో పాటు సురక్షిత సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని పోలీసులు పిలుపునిచ్చారు.

# ఆసుపత్రుల్లో పారిశుధ్యం, భద్రతపై రాజీపడొద్దు

**- గౌరవ ఆరోగ్య శాఖ మంత్రి సత్య కుమార్ సమీక్ష**



**దొరవారిసత్రం – సూర్య వాస్తవం:** రాష్ట్ర ఆరోగ్య, కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్ అధికారులతో కలిసి, డైరెక్టర్ ఆఫ్ సెకండరీ హెల్త్, డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ పరిధిలోని జిల్లా, ఏరియా ఆసుపత్రులు, సీహెచ్‌సీలు, బోధనాసు పత్రుల్లో పారిశుధ్యం, సెక్యూరిటీ నిర్వహణపై సంబంధిత ప్రైవేట్ ఏజెన్సీల ప్రతినిధులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి సత్య కుమార్ మాట్లాడుతూ ఆసుపత్రులకు వచ్చే రోగులకు అత్యంత పరిశుభ్రమైన, సురక్షితమైన వాతావరణం కల్పించడంలో ఎలాంటి అలసత్వానికి తావులేదని స్పష్టం చేశారు. కేవలం రికార్డులను చూసి సంతృప్తి చెందకుండా, ఆసుపత్రుల్లో వాస్తవంగా ఎంతమంది సిబ్బంది విధుల్లో ఉంటున్నారు, పారిశుధ్య పనులు ఏ స్థాయిలో జరుగుతున్నాయి, ఏజెన్సీల పనితీరు ఏ విధంగా ఉందనే అంశాలపై క్షేత్రస్థాయి పరిశీలన జరిపి సమగ్ర మూల్యాంకనం చేయాలని అధికారులను ఆదేశించారు. అలాగే సిబ్బంది హాజరు, పనితీరు, మార్కుల కేటాయింపుపై నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ ఆసుపత్రుల్లో పర్యవేక్షణ వ్యవస్థను మరింత పటిష్టం చేయాలని మంత్రి సత్య కుమార్ యాదవ్ సూచించారు.

# దళిత క్రైస్తవుల ఎస్సీ హోదాకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలి

**- ఢిల్లీలో మహాప్రదర్శన మహాధర్నాలో డిమాండ్**



**ప్రొద్దుటూరు – సూర్య వాస్తవం:** భారత ప్రజలలో భాగమైన అణగారిన దళిత క్రైస్తవుల ఎస్సీ హోదాకు పార్లమెంటులో చట్టబద్ధత కల్పించాలని దేశ రాజధాని ఢిల్లీలో మహాధర్నా నిర్వహించారు. పాల్గొన్న వక్తలు మాట్లాడుతూ సచార్ కమిటీ, రంగనాథ మిశ్రా కమిషన్ నివేదికలనే ప్రామాణికంగా కొలమానంగా ప్రాతిపదికగా తీసుకోవాలని, అడ్డదారుల్లో అక్రమపద్ధతుల్లో తప్పుడుమార్గంలో రాజ్యాంగ విరుద్ధంగా తీసుకొచ్చిన 1950 రాష్ట్రపతి ఉత్తర్వును సవరించి దళిత బౌద్ధులు, సిక్కులు హిందువులవలె దళిత క్రైస్తవులు, దళిత ముస్లింలకు కూడా విస్తరించాలని, ఇందుకు సంబంధించి దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీం కోర్టులో పెండింగ్ వ్యాజ్యాలన్నిటిని సత్వరమే డిస్పోజ్ చేయాలని, జస్టిస్ బాలకృష్ణన్ కమిషన్ నివేదికను వెంటనే కేంద్రానికి పార్లమెంటుకు సమర్పించాలని, రాజ్యాంగ విరుద్ధ చట్టాలను నిర్ణయాలను తీర్పులను ఎట్టిపరిస్థితుల్లో అంగీకరించరాదని, రాజ్యాంగ స్ఫూర్తిని గౌరవించాలని, దేశంలో అణగారిన దళితుల, దళిత క్రైస్తవుల, మైనారిటీల ధనమాన ప్రాణ ఆస్తులకు రక్షణ కల్పించాలని, ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ కడప జిల్లా సమన్వయకర్త దరియ సునీత (అమ్ములు), పార్నపల్లి నిర్మల, తీట్ల జయమ్మ, మూడు సంస్థల మహాజన రాజ్యం పార్టీ రాజ్యాంగ హక్కుల పరిరక్షణ సమితి మరియు ఆల్ ఇండియా దళిత క్రిస్టియన్ రైట్స్ ప్రొటెక్షన్ కమిటీ జాతీయ ఫోటో గ్రాఫర్ షేక్ షబ్బీర్ తో పాటు అన్ని కులాల మతాల ప్రాంతాల వర్ణాల వర్గాల అభ్యుదయ ప్రగతిశీల ప్రజాస్వామికవాద భావజాల జాతి ముద్దుబిడ్డల సహకారం సమన్వయం మరియు భాగస్వామ్యంతో ఈ గొప్ప కార్యాన్ని విజయవంతంగా నిర్వహించడం జరిగింది.